గుడుపల్లె రైల్వే క్రాస్ వద్ద గజమాలతో ఘన స్వాగతం





● త్వరలోనే మీరు కోరుకున్న చంద్రన్న రాజ్యం వస్తుంది
● పేదల ఆకలి తీర్చడానికే అన్న క్యాంటీన్లు

మీ ఆశలు వమ్ము కానివ్వం

● నారా భువనేశ్వరి వెల్లడి ● గుడుపల్లెలో మృతుల కుటుంబాలకు పరామర్శ



చంద్రబాబు పీఏ మనోహర్‌కు పరామర్శ



అన్న క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న భువనేశ్వరి

కుప్పం/గుడుపల్లె, ఫిబ్రవరి 20: 'మీ నాయకుడిపై చాలా నమ్మకం పెట్టుకున్నారు మీరంతా. ఆ నమ్మకం ఎప్పటికీ వమ్ము కానివ్వం. మీ కష్టాలు తీరే రోజు ఇంకా ఎంతో దూరంలో లేదు. త్వరలోనే మీరు కోరుకున్న చంద్రన్న రాజ్యం వస్తుంది'అని టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ ఎండీ నారా భువనేశ్వరి అన్నారు.'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆమె గుడుపల్లె మండలం, కుప్పంలో పర్యటించారు. చంద్రబాబు జైలుకెళ్లిన సమయంలో మనోవేదనతో మృతి చెందిన గుడుపల్లె మండలం కొడతనపల్లెకు చెందిన వి.వెంకటేశ్, , యామగానిపల్లెలో జి.శ్రీనివాసులు కుటుంబాలను పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.3 లక్షల చెక్కు అందించారు. అనంతరం రైల్వే స్టేషన్ సర్కిల్ సమీపంలో అన్న క్యాంటీన్ ప్రారంభించి మాట్లాడారు. 'చంద్రబాబు జైల్లో ఉన్న 53 రోజులూ మీరు నిద్రాహారాలు మాని ఆయనకోసం తపించారు. ఆయన జైలునుంచి వెలుపలకు రావాలని, ఆయనమీద పెట్టిన తప్పుడు కేసులు మాఫీ కావాలని ఎన్నో దేవుళ్లకు మొక్కుకున్నారు. ప్రభుత్వం ఎన్ని అరాచకాలకు పాల్పడినా నిరసనలు చేసి, మీ నాయకుడికోసం నిలబడ్డారు. నాయకుడిపై నమ్మకంతో ధైర్యంగా ఉన్నారు. పార్టీ శ్రేణులన్నీ మా కుటుంబంపై చాలా నమ్మకం పెట్టుకున్నారు. మీ భవిష్యత్తుకు గ్యారంటీ ఉంటాం' అంటూ భువనేశ్వరి హామీ ఇచ్చారు.

హారతులిచ్చి.. సారె పెట్టి

గుడుపల్లె మండలం, కుప్పం పర్యటనలో నారా భువనేశ్వరికి మహిళలు అడుగడుగునా మంగళ హారతులతో నీరాజనం పట్టారు. బెంగళూరు విమానాశ్రయంనుంచి బిసానత్తం వద్దకు మధ్యాహ్నం ఒకటిన్నర గంటలకు చేరుకున్న ఆమెకు ఘన స్వాగతం పలికారు. సాలచింతరపల్లె, కొడతనపల్లె, ఆవులతిమ్మేపల్లెలో మహిళలు హారతులు పట్టి, సారె అందించారు. గుడుపల్లె రైల్వే స్టేషన్ క్రాస్‌లో పార్టీ శ్రేణులు ఆమెను గజమాలతో సత్కరించాయి.

పేదల ఆకలి తీర్చడం ఓర్వలేక..

'పేదల కోసం అన్నగారు కిలో రెండు రూపాయల బియ్యం తీసుకొచ్చారు. పేదల ఆకలి తీర్చాలని చంద్రబాబు ముఖ్యమంత్రిగా రాష్ట్రంలో 364 అన్న క్యాంటీన్లు ప్రారంభిచారు. ఏటా 7.50 కోట్ల మంది భోజనం చేస్తూ వచ్చారు. ఇలా పేదల ఆకలి తీర్చుతుండడం ఓర్వలేకే ప్రభుత్వం అన్న క్యాంటీన్లను నిలిపేసింది. పేదల కడుపు కొట్టింది. అనంతరం టీడీపీ నాయకులు, కార్యకర్తలే అక్కడక్కడా సొంతంగా అన్న క్యాంటీన్లు తెరిచి పేదలకు అన్నదానం మొదలు పెట్టారు. ఇలా ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 150 అన్న క్యాంటీన్లు నడుస్తున్నాయి. మంగళగిరిలో నారా లోకేశ్ నాలుగు క్యాంటీన్లు నడుపుతున్నారు. కుప్పంలో ఒక్కటే ఉంది. ఇప్పుడు కుప్పంతోపాటు గుడుపల్లె, శాంతిపురం, రామకుప్పంలో ఒక్కోటి చొప్పున మొత్తం మూడు క్యాంటీన్లు ప్రారంభిస్తున్నాం. ఇవి పూర్తిగా మా కుటుంబం ఆధ్వర్యంలో నడుస్తాయి' అని భువనేశ్వరి చెప్పారు. అనంతరం ఆమె మల్లప్పకొండమీదకు వెళ్లి మల్లేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అక్కడ్నుంచి కుప్పం వచ్చి చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి పి.మనోహర్ ఇంటికి వెళ్లి, ఆయనను పరామర్శించారు. ఆపైన కుప్పం పట్టణ పరిధిలోని చర్చిలో ప్రార్థనలు జరిపారు. అనంతరం కుప్పం ఆర్అండ్‌బీ అతిథి గృహంలో రాత్రి బస చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, నియోజకర్గ టీడీపీ ఇన్‌ఛార్జి పీఎస్ మునిరత్నం, విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ సురేశ్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, వీజీ ప్రతాప్, గుడుపల్లె మండల నాయకులు చంద్రశేఖర్, మునిరాజు, తెలుగు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ కాలుతో నడిపిస్తా

గుడుపల్లె మండలం యామగానిపల్లెలో నారా భువనేశ్వరికి దివ్యాంగురాలైన పాంచాలమ్మ ఎదురయ్యారు. కాలు లేకపోవడంవల్ల తన బతుకు దుర్భరంగా మారిందని వాపోయారు. కృత్రిమ కాలు ఏర్పాటు చేసి నడిపిస్తానంటూ పాంచాలమ్మకు భువనేశ్వరి హామీ ఇచ్చారు.







యామిగానిపల్లెలో శ్రీనివాసులు చిత్రపటానికి నివాళులు - కొడతలపల్లెలో వెంకటేష్ కుటుంబానికి చెక్కు అందజేత - అన్న క్యాంటీన్‌లో మహిళలకు కరచాలనం - కుప్పంలోని చర్చిలో.. - మల్లేశ్వరస్వామి సన్నిధిలో..

నేటి పర్యటన ఇలా..

కుప్పం: కుప్పంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం నుంచి బుధవారం ఉదయం 9.30 గంటలకు నారా భువనేశ్వరి బయలుదేరతారు. శాంతిపురం మండలం కడపల్లె వద్ద నిర్మాణంలో ఉన్న సొంతింటిని పరిశీలిస్తారు. 10.10 గంటలకు శాంతిపురం పాత గ్రామీణ బ్యాంకు క్రాస్‌లో మహిళలతో 'ఆడబిడ్డలకు ఆర్థిక స్వేచ్ఛ' అంశంపై ముఖాముఖి నిర్వహిస్తారు. గంట పాటు వారితో మాట్లాడి సాధకబాధకాలు తెలుసుకుంటారు. 11.20 గంటలకు ఎన్టీఆర్ సర్కిల్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించి, సమీపంలోనే అన్న క్యాంటీన్ ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 12.20 గంటలకు రామకుప్పం పోలీసు స్టేషన్ సర్కిల్ వద్ద అన్న క్యాంటీన్ ప్రారంభించనున్నారు. ఆ తర్వాత వి.కోట మండలం విబూదిఎల్లాగరం గ్రామం వద్ద మధ్యాహ్నం 1.10 గంటలకు భోజనం చేస్తారు.

పెద్దపంజాణి: రామకుప్పం పర్యటన ముగించుకున్న తర్వాత నారా భువనేశ్వరి పెద్దపంజాణి మండలం శివాడి గ్రామానికి చేరుకుంటారు. చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో మనస్తాపంతో మృతిచెందిన కనకరాజు కుటుంబాన్ని.. కత్తార్లపల్లెలో శంకరప్ప కుటుంబాలను పరామర్శిస్తారు. వారికి ధైర్యం చెప్పి, ఆర్థిక సాయం అందిస్తారు.

పుంగనూరు: చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో మృతి చెందిన పుంగనూరు మండలం ఎస్‌ఎస్‌పేటకు చెందిన పద్మావతమ్మ, చెలిమిగడ్డకు చెందిన జయమ్మ, ఒంటిమిట్టకు చెందిన శ్రీనివాసులునాయుడు కుటుంబీకులను బుధవారం సాయంత్రం భువనేశ్వరి పరామర్శిస్తారు. అనంతరం మదనపల్లె చేరుకుంటారు.

అనంతాపురం రీచ్‌లో
ఇసుక తవ్వకాలు ఆపండి

● ఉత్తర్వులు జారీ చేసిన హైకోర్టు
● వీటిని అమలు చేయాలంటూ తహసీల్దార్‌కు గ్రామస్తుల వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న టీడీపీ నాయకులు, గ్రామస్తులు

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 20: చిత్తూరు రూరల్ మండలం అనంతాపురం రీచ్‌లో ఇసుక అక్రమ తవ్వకాలను వెంటనే ఆపాలని గ్రామస్తులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను పరిశీలించిన హైకోర్టు.. తవ్వకాలు ఆపాలని మంగళవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. నిబంధనలను ఉల్లంఘించి 20 అడుగుల లోతు వరకు ఇసుక తవ్వి.. ఇతర రాష్ట్రాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. ఈ కారణంగా గ్రామ పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలు అడుగంటి పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. రీచ్ పక్కనే ఉన్న శ్మశాన వాటికనూ అక్రమార్కులు తవ్వేస్తున్నారని ఆరోపించారు. కోర్టు ఉత్తర్వుల మేరకు ఇసుక తవ్వకాలను ఆపించాలని తహీసీల్దార్ శ్రీనివాసరెడ్డికి గ్రామస్తులు, టీడీపీ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శశికర్‌బాబు, మోహన్‌రాజ్, రాజా, కందస్వామి, సురేష్, రవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైసీపీ దాడిలో చూపే పోయింది

దివ్యాంగుడైన కుమారుడితో ఇంటికే వితంతువు పరిమితం ● టేకుమందలో ఆలస్యంగా వెలుగు చూసిన దారుణం



హంసవేణికి ధైర్యం చెబుతున్న టీడీపీ నేతలు



చిత్తూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకుడితో మాట్లాడటమే తప్పయింది. గ్రామంలో నీటి సమస్య ఉందని చెప్పడమే ఆమె నేరమైంది. దీన్ని మనసులో ఉంచుకుని అధికార పార్టీ నాయకుల ఇళ్లల్లోని మహిళలు గొడవకు దిగేవారు. చివరకు వీరి దాడిలో ఆ మహిళ రెండు కళ్లు దెబ్బతిని.. చూపే పోయింది. బంగారుపాళ్యం మండలం టేకుమందలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలిలా ఉన్నాయి.

బంగారుపాళ్యం మండలం టేకుమందకు చెందిన హంసవేణి భర్త రఘుపతి మూడేళ్ల కిందట మరణించారు. ఒక్కగానొక్క 16 ఏళ్ల కుమారుడు సుమన్ దివ్యాంగుడు. రెండు పాడి ఆవులతో పాటు కూలి పనులు చేసుకుంటూ ఆమె జీవనం సాగిస్తున్నారు. ఆ గ్రామంలో నెల కిందట పూతలపట్టు టీడీపీ ఇన్‌చార్జి మురళీమోహన్ 'బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఊరి బయటి చేతి పంపు నుంచి నీళ్లను తెచ్చుకుంటున్న హంసవేణిని ఆయన పలకరించారు. గ్రామంలో నీటి సమస్య ఉందని ఆమె చెప్పారు. 'టేకుమందలో తాగునీటి సమస్య ఉంటే సీఎం జగన్‌కు పట్టదా?' అంటూ ఆయన మీడియా సమావేశంలో ప్రశ్నించారు. హంసవేణి ఉంటున్న వీధిలో వైసీపీ సానుభూతిపరులు ఎక్కువ. ఈ విషయాన్ని వారు జీర్ణించుకోలేకపోయారు. హంసవేణి ఆవుల్ని కట్టేసేచోట వీరు మలవిసర్జన చేసి ఉద్దేశపూర్వకంగా ఇబ్బంది పెట్టేవారు. ఇదేంటని ఆమె ప్రశ్నించగా గొడవకు దిగేవారు. ఈ నెల 10వ తేది సాయంత్రం ఆ గ్రామానికి చెందిన వైసీపీ సానుభూతిపరుల ఇంట్లో మహిళలు హరియమ్మ, వెంకటమ్మ, కళమ్మ, తులసమ్మ, గీత, వెంకటమ్మ, చిట్టెమ్మ, మణెమ్మ హంసవేణి మీద దాడి చేశారు. చితకబాది ముఖంపై రాళ్లతో కొట్టారు. స్థానికులు హంసవేణిని బంగారుపాళ్యం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కళ్లకు సమస్య ఉందని గుర్తించి తిరుపతి అరవింద ఐ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ ఘటనలో హంసవేణికి రెండు కళ్లూ కనిపించకుండాపోయాయి. ఓ కన్ను పూర్తిగా కనిపించదని, మరో కన్ను గురించి మూడు నెలల తర్వాతగానీ చెప్పలేమని అరవింద ఐ ఆస్పత్రి నివేదిక ఇచ్చింది. అక్కడ 9 రోజుల పాటు చికిత్స పొందిన హంసవేణి సోమవారం డిశ్చార్జి అయ్యారు. దివ్యాంగుడైన కుమారుడితో పాటు ఈ మెమె కూడా ఇంటికే పరిమితం కావడంతో ఇల్లు గడవడం ఇబ్బందిగా మారింది. ఈ విషయమై బంగారుపాళ్యం సీఐ నాగరాజురావు కేసు నమోదు చేశారు. మంగళవారం హరియమ్మ, ఆమె కోడలు వెంకటమ్మను అరెస్టు చేసి రిమాండుకు పంపించినట్లు సీఐ చెప్పారు. 'దాడిలో హంసవేణి ఓ కన్ను కోల్పోయింది, మరో కన్ను గురించి మూడు నెలలు గడిస్తేగానీ చెప్పలేం' అని సీఐ అన్నారు.

బంగారుపాళ్యం: హంసవేణి కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని ఆ పార్టీ బంగారుపాళ్యం మండల అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్ భరోసానిచ్చారు. మంగళవారం ఆమెను పరామర్శించి ధైర్యం చెప్పారు. నాయకులు జనార్దన్ గౌడ్, హేమచంద్ర నాయుడు, సూరి నాయుడు, రమేష్, రవి, మల్లన్న, జానకిరామ్, సుబ్బన్న, బాబు తదితరులున్నారు.

అనుమానాస్పద స్థితిలో
సర్పంచి భార్య మృతి

● క్వారీ నీటిగుంటలో మృతదేహం
● భర్త, మరో మహిళ కొట్టి చంపేశారంటూ మృతురాలి కుటుంబీకుల ఆరోపణ
● పోలీసుల వద్ద లొంగిపోయిన నాయక్



భర్త, పిల్లలతో మాధవి (ఫైల్‌ఫొటో)



ఆస్పత్రి వద్ద ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మృతురాలి కుటుంబీకులు, బంధువులు

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 20: ప్రేమించుకున్నారు. కులాంతర వివాహం చేసుకున్నారు. ఇద్దరు ఆడపిల్లలు పుట్టాక.. కుటుంబంలో కలతలు రేగాయి. ఈ క్రమంలో మంగళవారం క్వారీ నీటి గుంటలో మాధవి మృతిచెంది ఉంది. ఆమె భర్త, సర్పంచి శ్రీనివాసులు నాయక్.. మరో మహిళ కలిసి చంపి క్వారీ గుంటలో పడేశారని మృతురాలి కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. పుంగనూరు మండలంలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి మృతురాలి తల్లి ఆర్‌కే రెడ్డెమ్మ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు, గ్రామస్తులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. నల్లగుట్లపల్లె తాండాకు చెందిన శ్రీనివాసులునాయక్, పులిచెర్ల మండలం రెడ్డివారిపల్లె పంచాయతీ చిచ్చిలివారిపల్లెకు చెందిన నాదమునిరెడ్డి కుమార్తె మాధవి తిరుపతిలో చదువుకుంటూ ప్రేమించుకున్నారు. పెద్దలను ఒప్పించి 2015 సెప్టెంబరు 5న వివాహం చేసుకున్నారు. వీరికి జ్యోత్స్నప్రియ(7), షణ్ముకప్రియ(5) కుమార్తెలు. ప్రస్తుతం సర్పంచి అయిన శ్రీనివాసులు నాయక్ భార్యతో పలుమార్లు గొడవ పడగా.. పెద్దలు పంచాయితీ పెట్టి మందలించారు. కొంతకాలంగా ఓ ఉద్యోగినితో అతడు వివాహేతర సంబంధం పెట్టుకోవడంతో భార్యాభర్తల మధ్య గొడవలు పెరిగాయి. ఆరు నెలల కిందట మరో మహిళతో కలసి వేరుకాపురం పెట్టడం.. భార్యకు విడాకుల పత్రాలు పంపడంతో వివాదం పెద్దదైంది. గ్రామ పెద్దలు పంచాయితీ పెట్టినా ప్రయోజనం లేకపోయింది. తన భర్త పెట్టే ఇబ్బందులపై తనకు న్యాయం చేయాలంటూ సోమవారం రాత్రి మాధవి గ్రామ పెద్దలను కోరింది. మంగళవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో నల్లగుట్లపల్లె తాండా సమీపంలోని క్వారీ నీటిగుంతలో మాధవి మృతిచెంది ఉంది. గ్రామస్తులు మృతదేహాన్ని బయటకు తీసి పోలీసులకు సమాచారమిచ్చారు. పుంగనూరు రూరల్ సీఐ కృష్ణారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని మృతిపై ఆరా తీశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. హెడ్ కానిస్టేబుల్ కేశవరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

హత్యేనంటూ మృతురాలి బంధువుల ఆగ్రహం

మృతి విషయం తెలిసి మాధవి కుటుంబీకులు, బంధువులు ప్రభుత్వాస్పత్రికి చేరుకున్నారు. ఆమె భర్త శ్రీనివాసులు నాయక్, అతడితో వివాహేతర సంబంధం పెట్టుకున్న మహిళ కలిసి ఆమెను కొట్టి చంపి క్వారీ నీటిగుంటలో పడేశారని ఆరోపించారు. శ్రీనివాసులునాయక్, ఆ మహిళ వచ్చేవరకు మృతదేహానికి పోస్టుమార్టం చేయొద్దంటూ ఆందోళనకు దిగారు. పోలీసులు వచ్చి వారికి సర్దిచెప్పారు. ఉదయం 5.30 గంటలకు శ్రీనివాసులునాయక్ ఫోనులో మాధవితో మాట్లాడి, క్వారీ వద్దకు పిలిపించి హత్య చేసినట్లు కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. ఈ మృతిపై అనుమానాలు ఉండటంతో శ్రీనివాసులు నాయక్ పోలీసులకు లొంగిపోగా.. వివాహేతర సంబంధమున్న మహిళ కనిపించలేదని తెలిసింది. ఈ ఘటనతో ఇద్దరు చిన్నారులు అనాథలయ్యారు.

అటవీశాఖకు రూ.86.92 లక్షల విడుదల

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 20: గతేడాది ఏనుగుల దాడిలో నష్టపోయిన కుటుంబాలను ఆదుకునేందుకు 86.92 లక్షల రూపయాలు మంజూరైనట్లు డీఎఫ్‌వో చైతన్యకుమార్‌రెడ్డి మంగళవారం తెలిపారు. 838.78 ఎకరాల పంట నష్టానికి రూ.53.96 లక్షలు, చనిపోయిన 11 జంతువులకు రూ.1.70 లక్షలు, మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.30 లక్షలు, గాయపడిన వారికి రూ.1.26 లక్షలు ఇవ్వనున్నట్లు తెలిపారు. 785 కేసులకు గాను రూ.86.92 లక్షలను త్వరలో అందజేస్తామన్నారు.

ఉమ్మడి చిత్తూరు, తిరుపతి జిల్లాల పరిధిలోని మెజారిటీ నియోజకవర్గాల్లో తాంబూలాలిచ్చేశాం తన్నుకు చావండి... అన్నట్టుగా మారింది అధికార పార్టీ తీరు. ఆశావహుల మధ్య, వర్గాల నడుమ సర్దుబాటు చేయకుండానే, సయోధ్య కుదుర్చకుండానే ఇంఛార్జులను ప్రకటించేసింది. దీంతో ఆయా నియోజకవర్గాల్లో ఇంఛార్జుల ప్రకటనపై పార్టీ నేతలు, శ్రేణుల్లో అసంతృప్తి, అసమ్మతి సద్దుమణగకపోగా మరింత ఎక్కువైంది. ఇంఛార్జుల ప్రకటనతో వర్గ విభేదాలు సర్దుకుంటాయని వైసీపీ అధిష్ఠానం వేసిన అంచనాలు దీంతో తలకిందులవుతు న్నాయి. కొన్ని స్థానాల్లో ఇంఛార్జుల స్వభావం సొంత పార్టీలోని వ్యతిరేక వర్గీయులతో అగాధం మరింత పెరిగిపోయేందుకు కారణమవుతోంది. వ్యతిరేకిస్తున్న వారిని కలుపుకునిపోయేందుకు ఏమాత్రం ప్రయత్నించకపోవడం లేదు. దీంతో విభేదిస్తున్న నేతల అహం దెబ్బతిని ఎన్నికల వేళ తీవ్ర పరిణామాలకు దారి తీస్తోంది.

తిరుపతి, ఆంధ్రజ్యోతి



తాంబూలాలిచ్చేశాం తన్నుకుచావండి!

- సర్దుబాటు చేయకుండానే వైసీపీ ఇంఛార్జుల ప్రకటన
- మెజారిటీ స్థానాల్లో వర్గ విభేదాలు... అసమ్మతులు

వెంకటగిరిలో ఆలస్యంగా వ్యతిరేకుల ఇళ్ళకు

వెంకటగిరిలో ఏడాది కిందటే ఇంఛార్జిగా నియమితులైనప్పటికీ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డికి నియోజకవవర్గంలో పార్టీపై పూర్తిగా పట్టు రావడం లేదు. సిట్టింగ్ ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డికి సన్నిహితులని భావించిన నాయకులందరినీ రామ్‌కుమార్‌రెడ్డి దూరం పెట్టారనే ఆరోపణలున్నాయి. ఇపుడు ఆనం పార్టీని వీడిపోయి, రామ్‌కుమార్‌రెడ్డికి లైన్ క్లియర్ అయినా కూడా ఆనం సన్నిహితులతో ఆయన సయోధ్య కుదుర్చుకోలేదు. దూరంగా వున్న నాయకులతో ఎన్నికల్లో నష్టం కలుగుతుందని భావించిన ఆయన తల్లి, మాజీ మంత్రి రాజ్యలక్ష్మి నేరుగా రంగంలోకి దిగి కుమారుడికి దూరంగా వున్న నాయకులను బుజ్జగించే ప్రయత్నం చేస్తున్నారు. పలువురు నాయకుల ఇళ్లకు వెళ్ళడంతో పాటు మరికొందరిని తన ఇంటికి ఆహ్వానించి కుమారుడికి ఎన్నికల్లో సాయం చేయాలని అభ్యర్థిస్తున్నారు. ఆమె పట్ల వారికి గౌరవం వున్నప్పటికీ వారు సర్దుకోలేకపోతున్నారు. రామ్‌కుమార్‌రెడ్డి వెళ్ళకుండా ఇంట్లో కూర్చుని వుంటే తామెందుకు మద్దతివ్వాలన్న ప్రశ్న వారి నుంచీ ఎదురవుతోంది. మొదటగా పోటీ చేయనున్న అభ్యర్థి వెళ్ళి సహకారం కోరితే తర్వాత ఆయన తరపు ఎవరు వెళ్ళినా ఇబ్బంది వుండేది కాదు.అలా కాకుండా రామ్‌కుమార్‌రెడ్డి బాగా ఆలస్యంగా మేల్కొని ఇపుడు ఎన్నికలు ముంచుకొచ్చాక వ్యతిరేకుల ఇళ్ళకు వెళుతున్నారు. దీంతో పార్టీలోని ఆయన వ్యతిరేకవర్గం సర్దుకునేందుకు సుముఖంగా లేరని సమాచారం.

గూడూరు ఎమ్మెల్యేతో పార్లమెంటు పరిధిలో నష్టం

గూడూరులో సిట్టింగ్ ఎమ్మెల్యేని పక్కన పెట్టి కొత్త ఇంఛార్జిగా ఎమ్మెల్సీ మేరుగ మురళీధర్‌ను వైసీపీ అధిష్ఠానం ప్రకటించేసింది. ఈ సందర్భంగా సిట్టింగ్ ఎమ్మెల్యే అభిప్రాయాలను ఏమాత్రం పరిగణనలోకి తీసుకోలేదు.కనీసం ప్రత్యామ్నాయం కూడా సూచించలేదు. ఐదేళ్ళు ఎంపీగా, ఐదేళ్ళు ఎమ్మెల్యేగా తాను సేవలందించిన పార్టీ నుంచీ ఈ రకమైన ధోరణి ఎదురుకావడం వరప్రసాదరావు మనసును కలచివేసినట్టు సమాచారం. దీంతో ఆయన తన పదేళ్ళ రాజకీయ నేపథ్యాన్నే అర్హతగా, ప్రామాణికతగా తీసుకుని జనసేన పార్టీ నుంచీ తిరుపతి ఎంపీగా పోటీ చేసేందుకు యత్నిస్తున్నారు.ఆయన తిరుపతి పార్లమెంటు పరిధిలో విస్తృతంగా పర్యటిస్తూ సన్నిహితులతో, పరిచయస్తులతో కలుస్తున్నారు. వారి మద్దతు కోరుతున్నారు. ఆయన కార్యకలాపాలు తెలుస్తున్నా వైసీపీ అధిష్ఠానం ఆయనతో సర్దుబాటుకు యత్నించడం లేదు. ఇది వరప్రసాదరావును, ఆయన సన్నిహితులను మరింత రెచ్చగొడుతోంది. దీంతో ఆయన రెట్టించిన పట్టుదలతో చాపకింద నీరులా జనసేనలో తన అవకాశాలను మెరుగుపరుచుకునేందుకు యత్నిస్తున్నారు. నిస్సందేహంగా ఇవి వైసీపీకి తిరుపతి పార్లమెంటులో, ప్రత్యేకించి గూడూరు సెగ్మెంట్‌లో నష్టం చేకూర్చే పరిణామాలే.

జీడీనెల్లూరులో సయోధ్యకు ఫలించని యత్నాలు

డిప్యూటీ సీఎంగా, సీఎం జగన్‌కు సన్నిహితుడిగా పేరున్నప్పటికీ నారాయణస్వామి టికెట్ విషయంలో అధిష్ఠానం నుంచీ అమర్యాదకర అనుభవాన్ని ఎదుర్కొన్నారు. నియోజకవర్గంలో పలువురు సొంత పార్టీ నాయకులు, పీఏలుగా వ్యవహరించిన రక్త సంబంధీకులు కూడా ఎదురు తిరిగారు. దీంతో అధిష్ఠానం ఆయన్ను చిత్తూరు ఎంపీ స్థానానికి ఇంఛార్జిగా బదిలీ చేసింది. ఆయన స్థానంలో చిత్తూరు ఎంపీని ఇంఛార్జిగా నియమించింది. వారం పదిరోజులకే మళ్ళీ నిర్ణయం మార్చుకుని వారిని వారివారి యథా స్థానాలకు తిరిగి ఇంఛార్జులుగా నియమించింది. తొలి ప్రకటనప్పుడు గానీ మలి ప్రకటనప్పుడు గానీ వర్గ విభేదాలు సర్దుబాటు చేసేందుకు అధిష్ఠానం యత్నించలేదు. నారాయణస్వామిని వ్యతిరేకిస్తున్నది ప్రధానంగా మాజీ ఎంపీ జ్ఞానేంద్రరెడ్డి. ఆయన కనుసన్నల్లోనే స్వామి వ్యతిరేకవర్గం కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. దీంతో జ్ఞానేంద్రరెడ్డితో సర్దుబాటు చేసుకునేందుకు స్వామి యత్నిస్తున్నారు. ఇటీవల సీఎం రాక సందర్భంగా రేణిగుంటలోని విమానాశ్రయంలో ఒకసారి, తర్వాత పెనుమూరులో వ్యవసాయ క్షేత్రంలో ఆయనతో మాట్లాడి సాయం చేయాలని అభ్యర్థించారు. అయితే క్షేత్రస్థాయిలో చేతులు కలిపేందుకు వ్యతిరేకవర్గం అంగీకరించడం లేదు. దీంతో నాయకుల చుట్టూ తిరగడం కంటే టికెట్ ప్రకటించాక నేరుగా జనం వద్దకే వెళ్ళి బతిమాలుకుంటానని నారాయణస్వామి సన్నిహితుల వద్ద వ్యాఖ్యానిస్తున్నట్టు సమాచారం. ఈ పరిణామంతో ఇరువర్గాల మధ్య విభేదాలు మరింత ముదురుతున్నాయి.

సైలెంటైన ముగ్గురు ఎమ్మెల్యేలు

చిత్తూరు సిట్టింగ్ ఎమ్మెల్యే శ్రీనివాసులును పక్కకు తప్పించి ఆర్టీసీ వైస్ ఛైర్మన్ విజయానందరెడ్డిని ఇంఛార్జిగా ప్రకటించిన ప్రారంభంలో అంతా బాగున్నట్టే అనిపించింది. గుడిపాల, చిత్తూరు రూరల్ మండలాల్లో ఎంచక్కా ఎమ్మెల్యేయే స్వయంగా అనుచరవర్గాలతో ఆత్మీయ సమావేశాలు పెట్టి విజయానందరెడ్డి గెలుపుకోసం సహకరించాలని కోరారు. అయితే రాజ్యసభ అభ్యర్థిత్వం విషయంలో అధిష్ఠానం నిర్ణయం మారిపోవడంతో ఒక్కసారిగా ఎమ్మెల్యే సైలెంట్ అయ్యారు. పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలకు రెండింటికీ దూరమయ్యారు. రాజకీయంగా వేగంగా నిర్ణయాలు తీసుకుని విజయవంతంగా అమలు చేయడంలో సిద్ధహస్తుడైన ఎమ్మెల్యే శ్రీనివాసులు పైకి మౌనంగా వున్నట్టు కనిపించినా అంతర్గతంగా ప్రత్యామ్నాయం కోసం గట్టి ప్రయత్నాలే చేస్తుంటారన్న అనుమానాలు వైసీపీ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. పూతలపట్టులో కూడా సిట్టింగ్ ఎమ్మెల్యే ఎంఎస్ బాబును పక్కన పెట్టి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్‌ను ఇంఛార్జిగా నియమించారు. బహిరంగంగానే మంత్రి పెద్దిరెడ్డిపై ఆరోపణలు చేసిన ఎంఎస్ బాబు తర్వాత పొరపాటైందని ప్రకటించి మౌనవ్రతం పాటిస్తున్నారు. మకాం బెంగుళూరుకు మార్చారు. వైసీపీ, ప్రభుత్వ కార్యక్రమాలు రెండింటికీ హాజరు కావడం లేదు. ఆయనకు మద్దతు పలికిన నాయకులు, అనుచరులు కూడా ఇంఛార్జితో కలవడం లేదు. ఎమ్మెల్యే తరహాలో పార్టీ కార్యకలాపాలకు దూరంగా వుంటున్నారు. వీరిని కలుపుకునిపోయేందుకు పార్టీ పరంగా కూడా ప్రయత్నాలు జరగడం లేదు. దీంతో రెండు వర్గాల నడుమ అంతరం అలానే వుండిపోయి రోజులు గడిచే కొద్దీ పెరుగుతోంది. మదనపల్లెలో సిట్టింగ్ ఎమ్మెల్యే నవాజ్ బాషాను విస్మరించి నిషార్ అహ్మద్‌ను ఇంఛార్జిగా నియమించిన సంగతి తెలిసిందే. దీనిపై బహిరంగంగా ఒక్కమాట కూడా మాట్లాడకుండా ఎమ్మెల్యే నవాజ్‌బాషా తెరమరుగయ్యారు. పార్టీ కార్యక్రమాలతో పాటు చివరికి అధికారిక కార్యక్రమాలకు కూడా దూరమయ్యారు. మకాం బెంగళూరుకు మార్చారు. ఎన్నికల్లో ఆయన చురుగ్గా పనిచేసేలా అధిష్ఠానం యత్నించడం లేదు. జిల్లా నేతలు సైతం ఆయన్ను పట్టించుకోవడం లేదు.

సత్యవేడు వైసీపీలో మరింత గందరగోళం

సిట్టింగ్ ఎమ్మెల్యే ఆదిమూలాన్ని తిరుపతి లోక్‌సభకు ఇంఛార్జిగా బదిలీ చేసి ఆయన స్థానంలో తిరుపతి ఎంపీ గురుమూర్తిని సత్యవేడు ఇంచార్జిగా నియమించడంతో అంతర్గత పోరు రగులుకుని తారస్థాయికి చేరిన సంగతి తెలిసిందే. ఇపుడు ఆ నియోజకవర్గంలో అధికార పార్టీ మరింత గందరగోళ పరిస్థితిని ఎదుర్కొంటోంది. ఆదిమూలం తాను ఎంపీగా పోటీ చేయనని ప్రకటించడంతో పాటు టీడీపీలో చేరే క్రమంలో యువనేత నారా లోకేశ్‌ను కూడా కలిశారు. ఆదిమూలం తిరుగుబాటుతో తిరుపతి ఎంపీ గురుమూర్తిని తిరిగి తిరుపతి లోక్‌సభ ఇంఛార్జిగా నియమించిన అధిష్ఠానం సత్యవేడుకు మంత్రి పెద్దిరెడ్డి అనుచరుడైన నూకతోటి రాజేష్‌కుమార్‌ను ఇంఛార్జిగా ప్రకటించింది. మంత్రి పెద్దిరెడ్డి సత్యవేడు నియోజకవర్గ ముఖ్యులను తిరుపతిలో తన ఇంటికి పిలిపించుకుని రాజేష్‌ను పరిచయం చేశారు. ఆయన గెలుపుకోసం కృషి చేయాలని నిర్దేశించారు. మంత్రి ఎదురుగా వినయంగా చేతులు కట్టుకుని మరీ తలలూపి బయటకు వచ్చిన నాయకులు నియోజకవర్గం చేరగానే స్థానికులకే టికెట్ ఇవ్వాలన్న డిమాండ్ వినిపిస్తున్నారు. కేవీబీపురం మండల నేత డేవిడ్ తన మద్దతుదారులను వెంటబెట్టుకుని రాజేష్ సమక్షంలోనే ఎంపీ మిథున్‌రెడ్డిని కలసి టికెట్ కోరడం కలకలం రేపింది. బయటి వారిని తమపై రుద్దకుండా స్థానికులకే టికెట్ కేటాయించాలన్న డిమాండ్ ఊపందుకుంటున్నందున నియోజకవర్గంలో గందరగోళం నెలకొంటోంది. దీనివల్ల అభ్యర్థి విషయంలో మార్పులుంటాయన్న అంచనాలు కూడా మొదలవుతున్నాయి.

నగరి, సూళ్ళూరుపేటల్లో కుదరని సయోధ్య

నగరి, సూళ్ళూరుపేట నియోజకవర్గాల్లో వైసీపీ అధిష్ఠానం ఇంఛార్జులను మార్చకపోయినప్పటికీ సిట్టింగ్ ఎమ్మెల్యేల వర్గాలకు, వ్యతిరేక వర్గాలకు నడుమ సయోధ్య కుదరడం లేదు. నగరిలో మంత్రి రోజాయే తిరిగి పోటీ చేస్తారా లేక కొత్త అభ్యర్థి వస్తారా అన్నది తేలడం లేదు. రోజా సైతం బింకంగానే తప్ప ధీమాగా తానే పోటీ చేస్తానని చెప్పలేకపోతున్నారు. అదే సమయంలో ఆమెను వ్యతిరేకిస్తున్న పార్టీ నేతలతో మాట్లాడి రాజీ కుదిర్చే ప్రయత్నం ఏ స్థాయిలోనూ జరగడం లేదు. జిల్లాపై పట్టున్న ఓ మంత్రి నగరిలో జోక్యం చేసుకుంటున్నారని గతంలో అధిష్ఠానానికి ఫిర్యాదులు చేసిన నేపథ్యంలో ఇపుడా మంత్రి తానెందుకు పట్టించుకోవాలని ప్రశ్నిస్తున్నట్టు సమాచారం. దీంతో వ్యతిరేకవర్గాన్ని కలుపుకుని పోయే ప్రయత్నాలకు స్వస్తి పలికిన రోజా వారు కలిగించే నష్టాన్ని పూడ్చుకునేందుకు ప్రత్యామ్నాయం అన్వేషిస్తున్నారు. ఆ క్రమంలో రాజకీయాలకు దూరంగా వున్న వర్గాలను, ముఖ్యులను కూడా కలసి మద్దతు కోరుతున్నారు. ఆమె తీరు సొంత పార్టీలో వ్యతిరేక వర్గాన్ని మరింతగా రెచ్చగొడుతోంది. వారి మధ్య అగాధం మరింత పెరుగుతోంది. సూళ్ళూరుపేటలో సైతం టికెట్ విషయంలో సంజీవయ్యకు అధిష్ఠానం హామీ ఇచ్చినట్టు ప్రచారమవుతోంది. అయినా పార్టీలో వ్యతిరేకవర్గం రాజీ పడడంలేదు. సంజీవయ్యకు టికెట్ ఇస్తే ఓడిస్తామన్న శపథానికి కట్టుబడి అధిష్ఠానం ప్రకటన కోసం వేచి చూస్తున్నట్టు సమాచారం. అవసరమైతే టీడీపీ అభ్యర్థికి బహిరంగంగా కొందరు, లోపాయికారీగా కొందరు సహకరించే పరిస్థితి కనిపిస్తోంది. ఇక్కడ కూడా ఎమ్మెల్యేకి, వ్యతిరేక వర్గానికి నడుమ విభేదాలు తొలగించి దగ్గర చేసే ప్రయత్నం ఎవరూ చేయడం లేదు. మొత్తానికి కీలకమైన ఎన్నికల వేళ ఉమ్మడి చిత్తూరు, తిరుపతి జిల్లాల పరిధిలో 17 అసెంబ్లీ నియోజకవర్గాలకు గానూ తొమ్మిది నియోజకవర్గాల్లో అధికార పార్టీ పరిస్థితి అంతర్గత కలహాలతో దారుణంగా వుంది.

హుండీ కానుకలను శ్రీవారికి, భక్తులకే వినియోగించాలి

మాజీ మంత్రి అమరనాథ రెడ్డి



తిరుమల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి హుండీ కానుకలను భగవంతుడికి, భక్తుల కోసమే వినియోగించాలని టీటీడీని కోరుతున్నానని మాజీ మంత్రి అమరనాథరెడ్డి అన్నారు. అలా చేస్తేనే స్వామికి భక్తులు సమర్పించిన కానుకలకు అర్థం, పరమార్థం లభిస్తుందని చెప్పారు. శ్రీవారిని మంగళవారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. ఆయన మాటల్లోనే.. 'రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని స్వామిని కోరుకున్నా. అలా ఉండాలంటే ఏం చేయాలో నాకంటే భగవంతుడికే బాగా తెలుసు. పవిత్రమైన తిరుమలలో రాజకీయాలు మాట్లాడకూడదు. కేవలం గోవిందనామస్మరణే చేయాలి. రాజకీయాలు మాట్లాడటానికి చాలా ప్రదేశాలున్నాయి. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి తిరుమలకు ప్రత్యేకత తీసుకొచ్చారు. ఆయన తర్వాత వచ్చిన ముఖ్యమంత్రులు కూడా దాన్ని పాటించారు. ఈ సంప్రదాయం రానురాను దిగజారే పరిస్థితి కనిపిస్తోంది. ప్రజలు దీన్ని గమనిస్తున్నారు. కొండపై రాజకీయాలు మాట్లాడటాన్ని వారి విజ్ఞతకే వదిలేస్తున్నా. ఈ విషయాన్ని అర్థం చేసుకుంటే భక్తి ఉందనుకోవాలి. అలాకాకుండా రాజకీయాలు మాట్లాడుతూనే ఉంటే భగవంతుడే చూసుకుంటాడు' అని అమరనాథరెడ్డి వివరించారు.

రూ.43.23 కోట్ల నీటి బిల్లులు విడుదల

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 20: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న తాగునీటి ట్యాంకుల బిల్లులు రూ.43.23 కోట్లు విడుదలయ్యాయని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ విజయ్ కుమార్ మంగళవారం చెప్పారు. మొత్తం 8034 బిల్లులకు గాను ఈ మొత్తం విడుదలైందన్నారు. త్వరలోనే వీటిని ఆన్‌లైన్ చేసి కాంట్రాక్టర్లకు చెల్లిస్తామన్నారు.

బాలికపై యువకుడి అత్యాచారం

రామకుప్పం, ఫిబ్రవరి 20: రామకుప్పం మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికపై యువకుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. తండ్రి పిలుస్తున్నాడంటూ ఆ బాలికను నమ్మించి.. ఆదివారం అటవీప్రాంతానికి తీసుకెళ్ళి అత్యాచారం చేశాడు. బాలిక కేకలతో స్థానికులు అక్కడకు చేరుకోవడంతో నిందితుడు పరారయ్యాడు. బాలిక తల్లిదండ్రులు సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడిని సోమవారం రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం : ఒకరి అరెస్టు



పోలీసులు స్వాధీనం చేసుకొన్న మద్యం ప్యాకెట్లతో నిందితుడు

తవణంపల్లె, ఫిబ్రవరి 20: కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి, రూ.1,06,000 విలువ గల మద్యం, రూ.5 లక్షల విలువైన కారును స్వాధీనం చేసుకొన్నట్లు చిత్తూరు డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి మంగళవారం తెలిపారు. మండలంలోని కాణిపాకపట్నం సమీపంలోని బెంగళూరు-తిరుపతి హైవే వద్ద సోమవారం సాయంత్రం తనిఖీలు చేపట్టామన్నారు. గుడిపాల మండలం వెప్పాలమానుచేను గ్రామానికి చెందిన ప్రకాష్ కుమారుడు ఉదయ్‌కుమార్(27) కారులో కర్ణాటక మద్యాన్ని చిత్తూరు వైపు తీసుకెళ్తూ తనిఖీల్లో పట్టుబడ్డాడన్నారు. అతడి నుంచి 35 బాక్సుల మద్యం బాటిళ్ల, 1680 టెట్రా ప్యాకెట్లను, కారును స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి రిమాండుకు పంపామన్నారు. ఉదయ్‌కుమార్‌పై ఇప్పటికే చిత్తూరు, చిత్తూరు తాలుకా, బైరెడ్డిపల్లె పోలీసు స్టేషన్లలో ఏడు కేసులు ఉన్నాయన్నారు. వెస్ట్ సీఐ రవిశంకర్‌రెడ్డి, తవణంపల్లె ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 20: మార్చి ఒకటి నుంచి 20వ తేదీ వరకు ఇంటర్ పరీక్షలను అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్వో పుల్లయ్య ఆదేశించారు. ఇంటర్ పరీక్షల నిర్వహణపై మంగళవారం చిత్తూరులో నిర్వహించిన జిల్లాస్థాయి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని 50 కేంద్రాల్లో ఫస్టియర్ విద్యార్థులు 15,905 మంది, సెకండియర్ 16,852 మంది చొప్పున 32,757 మంది పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. దీనికి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, ఆయా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని పేర్కొన్నారు. పరీక్షా సమయానికి తగ్గట్టుగా ఆర్టీసీ బస్సులను నడపాలన్నారు. సమావేశంలో డ్వామా పీడీ రాజశేఖర్, ఇంటర్ బోర్డు అధికారి సయ్యద్ మౌలా, అన్ని శాఖల అధికారులు, ఇంటర్ బోర్డు అధికారులు, కలెక్టరేట్ పరీక్షల విభాగ సూపరింటెండెంట్ గుణశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.



పరీక్షల నిర్వహణపై అధికారులతో సమీక్షిస్తున్న డీఆర్వో పుల్లయ్య

116 కేంద్రాల్లో టెన్త్ పరీక్షలు

మార్చి 18 నుంచి 30వ తేదీవరకు 116 కేంద్రాల్లో పదోతరగతి పరీక్షలు జరుగుతాయని డీఆర్వో పుల్లయ్య అన్నారు. మంగళవారం సాయంత్రం టెన్త్ పరీక్షలకు సంబంధించి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా 22,594 మంది పరీక్ష రాస్తున్నారన్నారు. వచ్చే నెల 5, 6 తేదీల్లో రానున్న ప్రశ్నపత్రాలను డీఈవో కార్యాలయం పక్కనున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భద్రపరచాలన్నారు. సమావేశంలో డ్వామా పీడీ రాజశేఖర్, డీఈవో దేవరాజుతో పాటు వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనుల్లో సొమ్మసిల్లి..

- మహిళా కూలీ మృతి



మృతిచెందిన రాజమణెమ్మ

విజయపురం, ఫిబ్రవరి 20: విజయపురం మండలం కాళికాపురంలో మంగళవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో ఉపాధి కూలీ రాజమణెమ్మ(60) మృతి చెందారు. సహచర కూలీలు తెలిపిన ప్రకారం.. స్థానిక సచివాలయ సమీపంలోని సప్లై చానల్‌లో ఉపాధి పనులు చేస్తుండగా రాజమణెమ్మ సొమ్మసిల్లి పడిపోయారు. మిగతా ఉపాధి కూలీలు ఆమెను పైకి తీసి సమీపంలోని చెట్టునీడకు చేర్చి ప్రథమ చికిత్స అందిస్తుండగా మృతి చెందారు. గుండె పోటుతో మృతి చెందారా, లేదా వడదెబ్బ కారణమా అనేది తెలియడం లేదని స్థానికులు చెప్పారు. ఏపీవో బబిత, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, వీఆర్వో వివేక్, మహిళా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఆర్టీసీ వైస్ ఛైర్మన్‌గా హరి



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి20:ఆర్టీసీ వైస్ ఛైర్మన్‌గా శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన మిద్దెల హరి నియమితులయ్యారు.విజయానందరెడ్డి స్థానంలో ఈయన్ను నియమించారు. గతంలో ఆప్కో డైరెక్టర్‌గా, శ్రీకాళహస్తి పురపాలక సంఘం ఫ్లోర్ లీడర్‌గా హరి పనిచేశారు.

'పాలిసెట్'కు దరఖాస్తు చేసుకోండి

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 20: పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకోసం నిర్వహించే ఏపీ పాలిసెట్ ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ మంగళవారం నుంచి ప్రారంభమైంది. ఈమేరకు ఏపీ రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ నోటిఫికేషన్ వెలువరించింది. ఏప్రిల్ ఐదో తేదీలోపు దరఖాస్తులకు గడువు కాగా, అదేనెల 27న ఉదయం 11నుంచి మధ్యాహ్నం ఒంటిగంటవరకు పరీక్ష జరగనుంది. మే ఐదో తేదీన ఫలితాలను విడుదల చేయనున్నట్లు నోటిఫికేషన్‌లో పొందుపరిచారు. దరఖాస్తు కోసం హెచ్‌టీటీపీఎస్:// పాలిసెట్‌ఏపీ.ఎస్‌బీటీ.ఇన్ వెబ్‌సైట్‌ని సంప్రదించాలి.

సమస్యలను పరిష్కరించకుంటే గుణపాఠం తప్పదు

కలెక్టరేట్ వద్ద ధర్నాలో ఏపీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి విజయ్‌కుమార్ హెచ్చరిక



ర్యాలీగా వస్తున్న ఏపీ జేఏసీ నేతలు

చిత్తూరు, ఫిబ్రవరి 20: ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే తగిన గుణపాఠం చెబుతామని ఏపీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి విజయ్‌కుమార్ హెచ్చరించారు. ఏపీ జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం చిత్తూరులోని పీవీకేఎన్ డిగ్రీ కళాశాల నుంచి ర్యాలీగా బయలుదేరి కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యలను ఈ ప్రభుత్వం పూర్తిగా గాలికొదిలేసిందన్నారు. నిరసనలు, ఆందోళనల రూపాల్లో సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఏపీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు కేవీ రాఘవులు మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన వారంరోజుల్లో సీపీఎస్‌ను రద్దుచేస్తామని గొప్పలు చెప్పి మాట మార్చారని విమర్శించారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని డిమాండు చేశారు. పెన్షన్లు ఒకటో తేదీన మంజూరు చేసి అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్‌ను పునరుద్ధరించాలన్నారు. 12వ పీఆర్సీతో కూడిన 30 శాతం ఐఆర్‌ను మంజూరు చేయాలని, డీఏ బకాయిల విడుదల, జీపీఎఫ్, రిటైర్మెంట్ బెనిఫిట్స్, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు. హెల్త్‌కార్డులపై నగదు రహిత చికిత్స అందించాలని, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలను పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సమస్యలను పరిష్కరించాలని, లేదంటే తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో ఎన్జీవో జిల్లా కార్యదర్శి వీజీ రఘు, జేఏసీ ప్రధాన కార్యదర్శి ముత్యాలరెడ్డి, నేతలు సోమశేఖర్ నాయుడు, మదన్‌మోహన్‌రెడ్డి, చెంగ్రాయమందడి, వివిధ తాలూకాల నుంచి అధ్యక్ష, కార్యదర్శులు, ఉద్యోగులు, కార్మికులు, పెన్షనర్లు పాల్గొన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న ఏపీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి విజయ్‌కుమార్

బాలికల పట్ల హెచ్ఎం అసభ్య ప్రవర్తన

- గ్రామస్థుల ఆరోపణ

శాంతిపురం, ఫిబ్రవరి 20: శాంతిపురం మండలం తిమ్మరాజుపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు విద్యార్థినులపట్ల అసభ్యకర రీతిలో ప్రవర్తిస్తున్నారంటూ గ్రామస్తులు ఆరోపించారు. తమ పిల్లలు చెప్పడంతో కొద్ది రోజుల క్రితం వీరు ప్రధానోపాధ్యాయుడితో వాగ్వాదానికి దిగారు. దాడి చేసినట్లు సమాచారం. వారం కిందట ఎంఈవో చంద్రశేఖర్‌కు ఫిర్యాదు చేశారు. ఆ పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడిని పంపరాదని, అలా పంపితే పరిస్థితి సీరియస్‌గా ఉంటుందని హెచ్చరించారు. నాలుగు రోజుల తర్వాత మళ్లీ ప్రధానోపాధ్యాయుడు పాఠశాలకు వచ్చారు. దీంతో మంగళవారం ఓ కల్యాణ మండపంలో డీఈవో ఉన్నారని తెలుసుకున్న గ్రామస్థులు, అక్కడికి వెళ్లి ఫిర్యాదు చేయాలనుకున్నారు. అప్పటికే ఆయన వెళ్లిపోవడంతో బుధవారం చిత్తూరుకే వెళ్లి ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

గుడుపల్లెలో నారా భువనేశ్వరి


గుడుపల్లెలో మంగళవారం అన్న క్యాంటీన్ ప్రారంభించి స్వయంగా భోజనం వడ్డిస్తున్న నారా భువనేశ్వరి


అన్నక్యాంటీన్ వద్ద జనాలను ఉద్దేశించి మాట్లాడుతున్న భువనేశ్వరి


యామిగానిపల్లె గ్రామస్తులకు పలకరింపు

శేషవాహనంపై కాశీవిశ్వేశ్వరుడి విహారం



పలమనేరు, ఫిబ్రవరి20 : పలమనేరు కాశీవిశ్వేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని శేష వాహనంపై ఊరేగించారు. ఆలయ ధర్మకర్త గంటే వీరభద్ర, ఆలయ కమిటీ సభ్యులు, ఎండోమెంట్ సిబ్బంది విజయ భాస్కరరెడ్డి పాల్గొన్నారు. ఊరేగింపులో భక్తులు తమ ఇళ్ల వద్దే స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకొన్నారు. ఈ కార్యక్రమాలకు స్థానిక శారద ఇంగ్లీషు మీడియం పాఠశాల నిర్వాహకులు కేఎస్. పుష్పలతారెడ్డి, క్రిష్టారెడ్డి, వాణి విద్యాసంస్థ నిర్వాహకులు సీపీ. బాలసుందరంరెడ్డి, సీపీ. వాణి, కె.కృష్ణమూర్తిరెడ్డి ఉభయదారులుగా వ్యవహరించారు.

చట్టాలపై అవగాహన ఉండాలి


సదస్సులో మాట్లాడుతున్న న్యాయవాది భాస్కర్

పలమనేరు, ఫిబ్రవరి20 : విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలని పలమనేరు సీనియర్ సివిల్ జడ్జి పగడాల శ్రీనివాసరావు తెలియజేశారు. మంగళవారం జిల్లా న్యాయసేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు సీనియర్ సివిల్ జడ్జి పగడాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో న్యాయవాది ఎల్.భాస్కర్ బాల్య వివాహాలు, ప్రామిసరినోట్, డ్రైవింగ్ లైసెన్సు, పిల్లల ప్రాథమిక హక్కుల గురించి వివరించారు. ఈ సదస్సులో న్యాయవాది అరీఫుల్లాఖాన్, మండల విద్యాశాఖ అధికారి బాలసుందరం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు షంషేర్, ఉపాధ్యాయులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

నాగదేవతలకు మండల పూజలు


మండల పూజల్లో ఉభయదారులు నారాయణరెడ్డి కుటుంబసభ్యులు

రామకుప్పం, ఫిబ్రవరి 20: రామకుప్పం మండలం కంబాలదేవులపల్లెలో సప్తమాతృకా చౌడేశ్వరమ్మ ఆలయం వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన నాగదేవత విగ్రహాలకు మంగళవారం మండల పూజలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం విగ్రహాలకు పంచామృతాభిషేకాలు నిర్వహించి, విశేష పుష్పాలంకరణ చేశారు. ఈ పూజలు 45 రోజుల పాటు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. తొలిరోజు మండల పూజల్లో ఉభయదార్లు నారాయణరెడ్డి, మోహన్‌రెడ్డి, మునస్వామిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, చెంగారెడ్డి, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

నాలుగు జంటలకు 'కళ్యాణమస్తు'

శాంతిపురం, ఫిబ్రవరి 20: శాంతిపురంలో మండలానికి సంబంధించి నాలుగు జంటలకు కల్యాణమస్తు, షాదీ తోఫా మంజూరైంది. సీఎం జగన్ మంగళవారం కల్యాణమస్తు, షాదీ తోఫా నిధులు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శాంతిపురం నుంచి కలెక్టర్ షన్మోహన్ పాల్గొన్నారు. మండలంలోని తిమ్మరాజుపల్లె, కృష్ణాపురం, మఠం, కడపల్లె గ్రామాలకు చెందిన జంటలు ఈ పథకాల ద్వారా లబ్ధిపొందినట్లు కలెక్టర్ తెలిపారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం


పెద్దమల్లెలలో ఆర్థిక అక్షరాస్యత అవగాహన సమావేశం

రొంపిచెర్ల, ఫిబ్రవరి 20: మండలంలోని ప్రజలు, రైతులు ఆర్థిక అక్షరాస్యత పెంచు కొన్నప్పుడే ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని రొంపిచెర్ల ఎస్‌బీఐ మేనేజర్ భాస్కర్‌బలయ్ అన్నారు. నాబార్డు సౌజన్యంతో మండలంలోని పెద్దమల్లెల పంచాయతీలోని నడింపల్లెలో మంగళవారం కళాకారులు మ్యాజిక్ షో ద్వారా, మాటలు, పాటలతో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. బ్యాంక్ స్కీమ్స్, రుణాలు, ప్రధాన మంత్రి సురక్షబీమా యోజన, పొదుపు సంఘాల గురించి, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది, ఎంపీ రూరల్ ఫోక్ ఆర్గనైజేషన్ కళాజాతా బృందం రాఘవేంద్ర, మహేష్, చంద్ర పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించాలి

సోమల, ఫిబ్రవరి 20: జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలని ఏపీడీ శ్రీనివాసులు కోరారు. మంగళవారం స్థానిక స్త్రీ శక్తి భవనంలో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. క్షేత్ర సహాయ సిబ్బంది తమ పరిధిలోని రైతుల నుంచి రాబోవు ఏడాదిలో చేపట్టే పనుల వివరాలు సేకరించి ప్రతి పాదనలు సిద్ధం చేయాలన్నారు. ప్రణాళిలు ఆన్ లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో దినకర్‌బాబు, జ్యోతి రెడ్డి, జేఈ రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

సింహ వాహనంపై వేణుగోపాలుడి విహారం



వి.కోట, ఫిబ్రవరి 20: రుక్మిణీ, సత్యభామా సమేత వేణుగోపాలస్వామి వారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. రెండవ రోజు మంగళవారం ఉదయాన్నే స్వామివారికి విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేపట్టారు. రాత్రికి స్వామివారి ఉత్సవ మూర్తులు సింహ వాహనంపై కొలువుదీరి పట్టణ పురవీధుల్లో ఊరేగారు. మంగళ వాయిద్యాలతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఊరేగింపు వైభవంగా ఊరేగింది. ఆలయ ధర్మకర్త సీతారామయ్య భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

గడపగడపకూ ఎమ్మెల్యే..



వి.కోట, ఫిబ్రవరి 20: పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ మంగళవారం మండల పరిధిలోని గోనుమాకులపల్లె పంచాయతీలో గడప గడపకు మీ ఎమ్మెల్యే కార్యక్రమం చేపట్టారు. రానున్న ఎన్నికలో తనను తిరిగి ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యువరాజ్, వైస్ ఎంపీపీలు డా.తమీంఖాన్, లక్ష్మణ్‌రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ బాలగురునాథ్, నేతలు గౌస్, బాలాజీ, కృష్ణమూర్తి, మురళి ఉన్నారు.

మాతృభాషను ఆదరించాలి


మాట్లాడుతున్న ఎంఈవో శివరత్న

సోమల, ఫిబ్రవరి 20: మాతృభాషను ప్రతి ఒక్కరూ గౌరవించి ఆదరించాలని ఎంఈవో శివరత్న అన్నారు. మంగళవారం మండలంలోని సోమల, నంజంపేట, కందూరు సీఆర్‌సీ సమావేశాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 21 అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకోవాలన్నారు. ఈ కార్యక్రమాల్లో హెచ్‌ఎంలు కుసుమాంబ, ఎల్లయ్య, సీఆర్పీలు సోమశేఖర్, అరుణ, అస్లాం, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ నివారణపై అవగాహన



పుంగనూరు రూరల్, ఫిబ్రవరి20: హెచ్‌ఐవీ నివారణకు తీసుకోవాల్సిన అంశాలపై జనచైతన్యసంస్థ జానపద గేయాల ద్వారా అవగాహన కల్పించారు. మంగళవారం స్థానిక మార్కెట్ యార్డు, గోకుల్ సర్కిల్, బస్టాండ్ ప్రాంతాల్లో నాటక ప్రదర్శనలు చేస్తూ జానపద గేయాల ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసిటిసి కౌన్సిలర్ హిమవంతరెడ్డి, ప్రాజెక్టు మేనేజర్ ఓబులేశ్, సిబ్బంది శ్రావణి నాగమణి, సాధిక్ పాల్గొన్నారు.

పల్స్ పోలియోను విజయవంతం చేద్దాం

కల్లూరు, ఫిబ్రవరి 20: పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఎంపీడీవో సురేష్‌బాబు తెలిపారు. పులిచెర్ల ఎంపీడీవో కార్యాలయంలో మంగళ వారం ప్రభుత్వ వైద్యాధి కారులు, వివిధ శాఖల అధి కారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 3న పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఐదేళ్లలోపు చిన్నారులం దరికీ పోలియో చుక్కలు తప్పక వేయించాలన్నారు. ఎంతఈట పోకల తాతయ్య, వైద్యాధికారులు జానకీరావు, ఎల్లయ్య, రెహ్మాన్, కార్యాలయం ఏఓ సుగుణమ్మ పాల్గొన్నారు.

రౌడీషీట్లు తెరిచిన పోలీసులకు శిక్ష తప్పదు

- చంద్రబాబు కట్టిన టిడ్కో ఇళ్లకు వైసీపీ రంగులు
- పుంగనూరు ఇన్‌చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి


టిడ్కో ఇళ్లకే వేసిన వైసీపీ రంగులు చూపుతున్న చల్లా రామచంద్రారెడ్డి

పుంగనూరు, ఫిబ్రవరి 20: పుంగనూరులో మంత్రి పెద్దిరెడ్డికి తొత్తులుగా మారి కొందరు పోలీసు అధికారులు చట్టవ్యతిరేకంగా టీడీపీ నేతలపై రౌడీషీట్లు తెరిచారని వారికి కోర్టులో శిక్షతప్పదని టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి హెచ్చరించారు. మంగళవారం పుంగనూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు నిర్మించిన టిడ్కో ఇళ్లకు కనీసం తాగునీరు, విద్యుత్ ఇవ్వలేని స్థితిలో వైసీపీ ప్రభుత్వం ఉందన్నారు. ప్రస్తుతం ఇళ్లకు సున్నం, వైసీపీ రంగులు వేస్తోందన్నారు. ఆ ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వకుండా వైసీపీ కార్యకర్తలకు, నాయకులకు ఇవ్వడానికి ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిపై నియోజకవర్గంలో ఇప్పటికే 110 మందిపై రౌడీషీట్లు తెరవాలని చూస్తున్నారని పేర్కొన్నారు. ఎన్నికలు దగ్గరపడుతున్న సమయంలో అక్రమ కేసులు పెట్టి భయాందోళనలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, వైసీపీకి కొమ్ముకాస్తున్న పోలీసులపై న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

నారా భువనేశ్వరి పర్యటనను విజయవంతం చేయాలి

పుంగనూరు, ఫిబ్రవరి 20: చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి బుధవారం పుంగనూరు నియోజకవర్గంలో చేపట్టే నిజం గెలివాలి కార్యక్రమాన్ని టీడీపీ శ్రేణులు విజయవంతం చేయాలని ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన టీడీపీ నాయకులతో కలిసి పుంగనూరులో పర్యటించి భువనేశ్వరి పర్యటన ఏర్పాట్లు సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు అరెస్టుతో మృతిచెందిన ముగ్గురి కుటుంబాలను భువనేశ్వరి పరామర్శిస్తారన్నారు. పుంగనూరు ఎన్ఎస్ పేటకు చెందిన పద్మావతమ్మ, చెలిమిగడ్డకు చెందిన జయమ్మ, మండలంలోని ఒంటిమిట్టకు చెందిన శ్రీనివాసులునాయుడు ఇళ్లకు వెళ్లి వారిని కలిసి మాట్లాడుతారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎం. శ్రీకాంత్, అసూరిబాలాజీ, సుహేల్‌బాషా, సీవీరెడ్డి, కుమార్, రాఘవ, ప్రసాద్, శమిపతి, రామయ్య, వెంకటస్వామి, ఇమ్రాన్, నౌషాద్, డికే. శ్రీనివాసులు, జనసేన నాయకులు చిన్నారాయల్, పగడాల రమణ, విరూపాక్షి, నరేశ్‌రాయల్, చైతన్యరాయల్ తదితరులు పాల్గొన్నారు.

రేపు నారా భువనేశ్వరి రాక

కల్లూరు, ఫిబ్రవరి 20: ఈ నెల 22న పులిచెర్ల మండలానికి విచ్చేస్తున్న నారా భువనేశ్వరి పర్యటనను విజయవంతం చేద్దామని చల్లా రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. పులిచెర్ల మండలం కమ్మపల్లి, పగడాలవారిపల్లిలో చల్లా రామచంద్రారెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు అరెస్టును జీర్ణించుకోలేక కమ్మపల్లికి చెందిన వెంకటపతినాయుడు, పగడాలవారిపల్లికి చెందిన దొరస్వామి మృతి చెందారన్నారు. 22న మధ్యాహ్నం 12 గంటలకు కమ్మపల్లికి, ఒంటి గంటకు పగడాలవారిపల్లికి నారా భువనేశ్వరి చేరుకొని ఆ రెండు కుటుంబాలను పరామర్శిస్తారన్నారు. టీడీపీ నాయకులు రామనాథంనాయుడు, సుబ్బారెడ్డి, ధనంజయనాయుడు, మురళీధర్ నాయుడు, గురప్ప, రామ్మూర్తి, నరేంద్ర, వెంకట్రామానాయుడు, దామోదర్ నాయుడు, శోభన్ బాబు, గోపినాయుడు, నజీర్, బండ్ల రమేష్, చెంగ్రాయ నాయుడు, పూల రమేష్, మోహన్ దాస్, భాస్కర్, అరుణాచలంనాయుడు, పురుషోత్తంనాయుడు, నరసింహులు, జగన్నాథరెడ్డి, హరి పాల్గొన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి పెద్దిరెడ్డి


హంద్రీ-నీవా కాలువను పరిశీలిస్తున్న మంత్రి

శాంతిపురం/ రామకుప్పం, ఫిబ్రవరి 20: శాంతిపురం మండలంలో ముఖ్య మంత్రి జగన్ పర్యటన ఏర్పాట్లను మంగళవారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కలెక్టర్ షన్మోహన్, జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తదితరులు పరిశీలించారు. ఈనెల 26న సీఎం శాంతిపురం పర్యటన ఖరారైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వారు శాంతిపురం మండలం మఠం వద్ద బహిరంగ సభ నిర్వహించనున్న ప్రదేశాన్ని పరిశీలించారు. అనంతరం మంత్రి శాంతిపురంలోని ప్రైవేటు కళ్యాణ మండపంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సీఎం పర్యటనలో ఎటువంటి లోటుపాట్లు రాకుండా చర్యలు తీసుకో వాలని ఆదేశించారు. ● రామకుప్పం మండలంలోని రాజుపేట వద్ద హంద్రీ-నీవా కాలువను, సీఎం కోసం సిద్ధం చేసే హెలీప్యాడ్ స్థలాలను వారు పరిశీలించారు. వారి వెంట ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్, జడ్పీ చైర్మెన్ శ్రీనివాసులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ఉన్నారు. కాగా సీఎం జగన్ తన పర్యటనలో ముందుగా రాజుపేట వద్ద హంద్రీ-నీవా కాలువలో జలాలకు జలహారతి ఇచ్చి, అనంతరం శాంతిపురం మండలంలో జరిగే బహిరంగసభలో పాల్గొననున్నట్లు సమాచారం.

నేడు అన్న క్యాంటీన్‌ను ప్రారంభించనున్న నారా భువనేశ్వరి


అన్న క్యాంటీన్ స్థలాన్ని పరిశీలిస్తున్న మనోహర్

రామకుప్పం, ఫిబ్రవరి 20: నారా భువనేశ్వరి బుధవారం మధ్యాహ్నం రామకుప్పంలో పర్యటించనున్నారని చంద్రబాబు పీఏ మనోహర్, టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పత్రినారాయణాచారి, మండల అధ్యక్ష, పద్రాన కార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ ఎంపీపీ ఆంజినేయరెడ్డి, మాజీవైస్ఎంపీపీ చిన్నికృష్ణలు కోరారు. మంగళవారం రామకుప్పంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ శ్రేణుల సమావేశంలో వారు మాట్లాడారు. బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు స్థానిక పోలీసుస్టేషన్ సర్కిల్లో అన్న క్యాంటీన్‌ను భువనేశ్వరి ప్రారంభిస్తారని తెలిపారు. స్థానిక బందార్లపల్లెక్రాస్ వద్ద భువనేశ్వరికి స్వాగతం పలికేందుకు కార్యకర్తలు, అభిమానులు, మహిళలు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో తెలుగు యువత మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు విశ్వనాథ్, వెంకటాచలం, ఆదిల్ పాల్గొన్నారు.

● పట్టణంలోని ముద్దనపల్లె ఆటో సర్కిల్ సమీపంలో ఏర్పాటు చేయనున్న అన్న క్యాంటీన్ స్థలాన్ని చంద్రబాబు పీఏ మనోహర్, పార్టీ నేతలతో కలిసి పరిశీలించారు.

సీతారాముల పల్లకీ సేవలు


ఊరేగుతున్న సీతారాముల ఉత్సవమూర్తులు

సోమల, ఫిబ్రవరి 20: సోమల పంచాయతీ గన్నావారిపల్లెలో కోదండ రామస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా మంగళవారం సీతారాముల ఉత్సవమూర్తులను గ్రామ పురవీధుల్లో కోలాహలంగా ఊరేగించారు. సోమల - పుంగనూరు రహదారి నుంచి గన్నావారిపల్లె వరకు పచ్చని తోరణాలు, జైశ్రీరాం జెండాలు రెపరెప లాడాయి. ఆలయానికి విద్యుత్ దీపాలంకరణ చేశారు. ఇంటింటా మహిళలు మంగళహారతులు పట్టారు. ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజలు, అభిషేక పూజల్లో సోమల, చెన్నయ్యగారిపల్లె, భారతంమిట్ట, రాశెట్టివారి పల్లె, దిడ్డివారిపల్లె, అడుసుపల్లె, ఇరికిపెంట తదితర గ్రామాల భక్తులు పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

'సురక్ష'ను సద్వినియోగం చేసుకోవాలి



సోమల, ఫిబ్రవరి 20: సురక్ష కార్యక్రమాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలని జడ్పీటీసీ కుసుమ, ఎంపీపీ ఈశ్వరయ్య అన్నారు. మంగళవారం ఇరికిపెంట సచివాలయంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు డాక్టర్ జయసింహ, శ్రీనివాసులు, అనురాధ, లక్ష్మీపతి 366 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఇద్దరిని ఆపరేషన్‌కు రెఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచు రెడ్డెప్ప, ఎంపీటీసీ హరినాథ్, ఏఎంసీ మాజీ చైర్మన్లు మోహన్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు మల్లారమ్మ విగ్రహ ప్రతిష్ఠ

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి20: పట్టణంలోని బాలాజీ థియేటర్ సమీపంలో బుధవారం మల్లారమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్లు ధర్మకర్త కొండప్ప తెలిపారు. ఆయన మాట్లాడుతూ బుధ, గురువారాల్లో గణపతి ప్రార్థన, మల్లారమ్మ ప్రాణప్రతిష్ఠ, కలశవాహనం, మహాకుంభాభిషేకం, మహామంగళహారతి జరుగుతుందన్నారు. భక్తులు మొక్కులు తీర్చుకుని తీర్థ ప్రసాదాలు అందుకోవాలని ఆయన కోరారు.

గడ్డివామికి నిప్పంటించిన ఆకతాయిలు



గంగవరం, ఫిబ్రవరి 20 : గుర్తుతెలియని ఆకతాయిలు గడ్డివామికి నిప్పంటించారు. ఈ సంఘటన మంగళవారం గుండుగల్లు గ్రామంలో చోటు చేసుకొంది. బాధితుల కథనం మేరకు... గుండుగల్లు గ్రామానికి చెందిన జయరామయ్య పొలం వద్ద వరిగడ్డి వామి వేశాడు. మధ్యాహ్నం పొలం వద్ద పనులు పూర్తి చేసుకొని భోజనం కోసం ఇంటికి వచ్చాడు. ఆ సమ యంలో పొలం వద్ద గడ్డికి నిప్పంటుకొని మంటలు ఎగసిపడ్డాయి. చుట్టు పక్కల రైతులు హుటాహుటిన అక్కడకు చేరుకొని మంటలను ఆర్పడానికి ప్రయత్నించారు. అయితే అప్పటికే గడ్డివామి పూర్తిగా దగ్ధ మైంది. గడ్డివామి పక్కనే ఉన్న షెడ్డుకు కూడా నిప్పంటుకోవడంతో, అందులోని సామగ్రి అగ్నికి ఆహుతైంది. సుమారు రూ.2 లక్షల నష్టం వాటి ల్లింది. గుర్తు తెలియని ఆకతాయిలే గడ్డివామికి నిప్పం టించి ఉంటారని బాధిత రైతు బోరున విలపించాడు. అధికారులు స్పందించి తనను ఆదుకోవాలని పోలీసులకు, రెవిన్యూ అధికారులకు వినతిపత్రం అందించాడు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రత్యేక హోదా


పూజగానిపల్లెలో పర్యటిస్తున్న కాంగ్రెస్ నాయకుడు రామకృష్ణారెడ్డి

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి20: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రత్యేక హోదా వస్తుందని ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పూజగానిపల్లెలో ఇంటింటా తిరిగి కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో హస్తం గుర్తుకే ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం రాష్ట్రానికి రావాల్సిన ప్రత్యేక హోదా, ప్యాకేజీలపై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయకుండా వారికి అనుకూలంగా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీదేవి, సైదాని, పవన్‌కుమార్‌రెడ్డి, నాయక్, నాసిర్‌బాషా పాల్గొన్నారు.

వైభవంగా చండీ హోమం

- పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు
- దుర్గమ్మకు దీపనైవేద్యం సమర్పించిన మహిళలు

వి.కోట, ఫిబ్రవరి 20: వి.కోటలో వెలసిన దుర్గామాత ఆలయం వద్ద చండీ హోమం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయం ప్రారంభించి పుష్కర కాలం పూర్తయిన సందర్భంగా ఆలయ కమిటీ వారు ఈ యాగం జరిపించారు. మంగళవారం ఉదయం కంకణబద్ధులైన దంపతులు అమ్మవారికి సారె, ఇతర పూజా సామగ్రిని భక్తిశ్రద్ధలతో మంగళ వాయిద్యాల నడుమ ఆలయం నుంచి తీసుకువచ్చి యాగశాలలో సమర్పించారు. శృంగేరి, కంచికి చెందిన వేద పండితులు శ్రీధర్ శర్మ బృందం దుర్గా పారాయణం, చండీ హోమం క్రతువును అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. చండీమాత అసురులను సంహరించిన విధానాలను గురువులు, అర్చకులు భాస్కర్‌శర్మ భక్తాదులకు వివరించారు. ఉదయం ప్రారంభమైన యగం సుమారు నాలుగు గంటల పాటు కొనసాగింది. ఆపై యాగశాలకు విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారికి సారెతో పాటు మంగళసూత్రం, మెట్టెలు, ఇతర అలంకరణ వస్తువులతో పాటు పలు ఆభరణాలను హోమానికి అంకితం ఇచ్చారు. సుమారు 108 జంటలు సంప్రదాయ వస్త్రధారణతో ఈ హోమంలో పాల్గొన్నారు. ఆపై అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి, మహామంగళ హారతులు సమర్పించారు. సాయంత్రం అమ్మవారిని ఆలయ కళ్యాణ మండపంలోకి వేంచేపు చేశారు. దుర్గమ్మకు దుర్గాదీప నైవేద్యం, లలితా సహస్రనామాం అర్పించారు. అనంతరం మండపంలో కొలువైన దుర్గామల్లేశ్వర స్వామివారికి విశేష పూజలు జరిపించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీపీ యువరాజ్, సర్పంచ్ పీ.ఎన్. లక్ష్మి, టీడీపీ మండల అధ్యక్షులు రంగనాథ్, వైసీపీ కన్వీనర్ బాలగురునాథ్ దంపతులు, ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యంరాజు, కళ్యాణమండప కమిటీ అధ్యక్షులు దామోదర్‌రెడ్డి, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ భక్తులకు తీర్థ, ప్రసాదాలతో పాటు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.




హోమం నిర్వహిస్తున్న వేదపండితులు ● హోమం కోసం పూజా సామగ్రి, సారె తీసుకువస్తున్న మహిళలు, దుర్గమ్మకు మంగళహారతులు ఇస్తున్న ఆలయ అర్చకులు

నొక్కుడు సరే.. బాదుడు సంగతేంటి..?



కరపత్రాలను అందజేస్తున్న గాలి భాను ప్రకాష్

నిండ్ర, ఫిబ్రవరి 20: సీఎం జగన్ రెడ్డి బటన్ నొక్కుతున్నానని గొప్పలు చెబుతున్నారని, అయితే పన్నుల ఛార్జీల రూపంలో ప్రజలనుంచి ముక్కుపిండి డబ్బు వసూలు చేస్తున్నారని, దీన్ని ప్రజలు ఆలోచించాలని నగరి నియోజక వర్గ టీడీపీ ఇన్‌చార్జి గాలి భాను ప్రకాష్ అన్నారు. మంగళవారం మండలం లోని ఆరూరు గ్రామ పంచాయతీలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ, జనసేన ప్రభుత్వంలో సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామన్నారు. వైసీపీని ఇంటికి సాగనంపడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్ర మంలో ఎలుమల్లై, పయణి, వినోద్, ఓబుల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రాభివృద్ధి



దిగువతడకరలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న మురళీమోహన్

తవణంపల్లె, ఫిబ్రవరి 20: వైసీపీ పాలనలో అధోగతిపాలైన రాష్ట్రం బాగు పడాలంటే టీడీపీ అధినేత చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే సాధ్యమని పూతలపట్టు టీడీపీ ఇన్‌ఛార్జి మురళీమోహన్ అన్నారు. మంగళవారం మండ లంలోని గల్లావాళ్లఊరు, మిట్టఇండ్లు, దిగువతడకర తదితర గ్రామాల్లో ఇంటిం టికి వెళ్లి బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మురళీమోహన్ గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి రానున్న ఎన్నికలలో టీడీపీ విజయానికి కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ పరిశీల కులు బొమ్మన శ్రీధర్, మండల పార్టీ అధ్యక్షులు గాలి దిలీప్‌కుమార్, మాజీ జడ్పీటీసీలు వెంకటేష్‌చౌదరి, మండల ప్రధాన కార్యదర్శి మధుకుమార్, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు మోహన్‌నాయుడు, సునీల్, పూత్తురు సర్పంచ్ రవిచంద్రారెడ్డి, నాయకులు గోపి, శరవణ, సుధాకర్ నాయుడు, భాస్కర్‌యాదవ్, వినాయక, గణపతి, తులసీ, సతీష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాలీబాల్‌లో కొత్తపల్లికి తృతీయస్థానం



క్రీడాకారులను అభినందిస్తున్న జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 20: ఇటీవల విశాఖలో ముగిసిన రాష్ట్రస్థాయి ఆడుదాం ఆంధ్ర పోటీల్లో చిత్తూరు జిల్లా గుడిపాల మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన యువకులు రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంటులో తృతీ యస్థానం పొందారు. మంగళవారం రాత్రి జేసీ ఛాంబర్‌లో జేసీ శ్రీనివాసులు కొత్తపల్లి గ్రామ క్రీడాకారులు గోపి, సూర్య, సుజిత్, దిలీప్, సతీష్, కార్తీక్, తంబు, విమల్‌రాజ్, రామన్, నందకుమార్, నవీన్‌లను అభినందించారు. వారు కైవసం చేసుకున్న ట్రోఫీని, క్రీడాకారులకు పతకాలను జేసీ అందజే శారు. రానున్న కాలంలో క్రీడా నైపుణ్యాన్ని మరింత పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడాధికారి బాలాజి తదితరులు పాల్గొన్నారు.

ఐదు ఆర్థిక అక్షరాస్యతా కేంద్రాలు ప్రారంభం



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న ఎల్డీఎం హరీష్

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 20: సమాజంలో వస్తున్న మార్పులకు అనుగు ణంగా గ్రామీణ ప్రజలు సైతం ఆర్థిక అక్షరాస్యతలను అలవరచుకోవాలని ఎల్డీఎం ఎ. హరీష్ అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో ఆర్థిక అక్షరా స్యత కేంద్రాన్ని ప్రారంభిస్తూ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఎల్డీఎం మాట్లాడుతూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ బ్యాంక్ ఆర్థిక సహ కారంతో చిత్తూరు రూరల్, పూతలపట్టు, గంగాధరనెల్లూరు, వి.కోట, గుడుపల్లి ప్రాంతాల్లో ఆర్థిక అక్షరాస్యత కేంద్రాలను ప్రారంభించామన్నారు. గ్రామీణులకు ఆర్థిక ప్రణాళికలను రూపొందించడం, పొదుపు అలవాటు చేయడం, ఆదాయ, వ్యయాలను నియంత్రించడం వంటి కార్యక్రమాలపై ఈ కేంద్రాల ద్వారా అవ గాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ బ్యాంకుల మేనేజర్లు టి.ఆర్. శ్రీనివాసన్, కె. హరీష్ రెడ్డి, బి. నాగేంద్ర బాబు, డి. వెంకటేశన్, డి. పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

దాడి అమానుషం



గుడిపాలలో టీడీపీ నేతల నిరసన

గుడిపాల, ఫిబ్రవరి 20: అనంతపురం జిల్లా రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటో గ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకలు దాడి చేయడం హేయమైన చర్య అని గుడిపాల మండల పాత్రికేయులు అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యా లయం ఎదుట నిరసన తెలిపి డీటీ కళ్యాణికి వినతిపత్రాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు టీఎస్ రమేష్, కుమార్, నంబికోరాజ్, ప్రతాప్, కాళిదాస్, సుందరం, శీను, సూర్య తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మండల టీడీపీ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం నాయుడు, ప్రధాన కార్యదర్శి చంద్ర మోహన్ ఆధ్వర్యంలో ఫొటోగ్రాఫర్‌పై జరిగిన దాడిని నిరసిస్తూ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని ఇచ్చారు. రోడ్డుపై టీడీపీ జెండాలతో నిరసన తెలి పారు. అనంతరం డీటీ కళ్యాణికి వినతిపత్రాన్ని ఇచ్చారు. మాజీ సర్పంచ్ ప్రతాప్ నాయుడు, టీడీపీ నేతలు చల్లా, సుధాకర్‌యాదవ్, మహదేవ, బాల, తదితరులు పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురం: పుల్లూరు క్రాస్ రోడ్డుల్లో విలేకర్లపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని మంగళవారం మండల టీడీపీ అధ్యక్షుడు గంధమ నేని జయశంకర్ నాయుడు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సీఎం జగన్ ప్రభుత్వ హయాంలో ఇలాంటి సంఘటనలు జరుగుతూనే ఉన్నాయని, పునరా వృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిద్దయ్యశెట్టి, నీరంజన్‌రెడ్డి, ఎన్. కుమార్, దొడ్డ హేమాద్రి యాదవ్, భూపతిరెడ్డి, వాసు నాయుడు, అప్పల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



శ్రీరంగరాజపురంలో టీడీపీ నేతల నిరసన

టీడీపీ ఫ్లెక్సీ చించివేత...

- పోలీసులకు ఫిర్యాదు



పూతలపట్టు, ఫిబ్రవరి 20: మండలంలోని పోటుకనుమ గ్రామంలో టీడీపీ నేతలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని అదే గ్రామానికి చెందిన ఓ యువకుడు చించివేయడంతో స్థాని కులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పూతలపట్టు మండలం ఎస్సీసెల్ అధ్యక్షుడు సుబ్బారాజులు, పోటుకనుమ గ్రామా నికి చెందిన టీడీపీ అభిమానులు, కార్యకర్తలు సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామంలో రెండు ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. వీటిలో 20రోజుల క్రితం ఒక ఫ్లెక్సీకి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించారు. ఇదిలావుండగా అక్కడ వున్న మరో ఫ్లెక్సీని అదేగ్రామానికి చెందిన ఓ యువకుడు ఉద్దేశ పూర్వకంగానే చింపేశాడని సుబ్బరాజులు మంగళవారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వలంటీర్లకు వందనం

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 20: గంగాధరనెల్లూరు ఎంపీ డీవో ఆఫీస్ వద్ద మంగళవారం వలంటీర్లకు వందనం సమా వేశం జరిగింది. డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎంపీపీ అనిత, ఎంపీడీవో భాస్కర్, ఈవోపీఆర్డీ రాఘవేంద్రరాజు, ఏవో సుధాకర్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు కార్యక్రమంలో పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురం: శ్రీరంగరాజపురం ఎంపీడీవో కార్యా లయం వద్ద మంగళవారం వలంటీర్లకు వందనం కార్య క్రమం జరిగింది. డిప్యూటీ సీఎం నారాయణస్వామి, డీసీసీబీ డైరెక్టర్ బాలసుబ్రమణ్యంరెడ్డి, జడ్పీటీసీ రమణప్రసాద్‌రెడ్డి, ఎంపీపీ సరితా, సర్పంచ్ హరితకుప్పయ్య, మండల కన్వీనర్ మణి, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

పేదల కోసమే అన్న క్యాంటీన్

గుడిపాల, ఫిబ్రవరి 20: నిరుపేదల కడుపు నింపడానికే అన్న క్యాంటీన్‌ను నిర్వహిస్తున్నట్లు మండల టీడీపీ అధ్య క్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు అన్నారు. మంగళవారంతో 207వ రోజుకు చేరుకుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ప్రతాప్ నాయుడు, చంద్రమోహన్, గోవిందగౌడ్, జయరామయాదవ్, చల్లా, సుధాకర్ యాదవ్, కిట్టు తదిత రులు పాల్గొన్నారు.

పూతలపట్టులో...

పూతలపట్టు, ఫిబ్రవరి 20: మండల కేంద్రంలోని అంబే డ్కర్ సర్కిల్ వద్ద ఏర్పాటుచేసిన అన్న క్యాంటీన్‌లో మంగళ వారం కొండేపల్లి గ్రామానికి చెందిన విజయ్ నాయుడు భోజనం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ దొరబాబు చౌదరి, నాయకులు ప్రతాపనేని చంద్రమౌళి, మునికృష్ణమ నాయుడు, ఏకాంబరం, లోకనాథ నాయుడు, గురుస్వామి, వీరభద్రయ్య, లోక, హరి తదిత రులు పాల్గొన్నారు.

బంగారుపాళ్యంలో...

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 20: మండలంలోని అన్నక్యాం టీన్‌లో మంగళవారం మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్ ఆధ్వర్యంలో బంగారుపాళ్యంకు చెందిన బాలాజీ మనవరాలు సాహితీ జన్మదినం సందర్భంగా భోజనం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో కమల్‌నాథ రెడ్డి, వంశీ, హేమచంద్ర నాయుడు, జనార్దన్ గౌడ్, హరిప్ర సాద్, రాధాకృష్ణమ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి: జనసేన



మాట్లాడుతున్న జనసేన నాయకులు

విజయపురం, ఫిబ్రవరి 20: పోలీసులు కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని జనసేన నియోజకవర్గ సమన్వయ కర్త మెరుపుల మహేశ్ పేర్కొన్నారు. మంగళవారం విజయ పురంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని మల్లారెడ్డి కండ్రిగలో ఆదివారం టీడీపీ, జనసేన పార్టీలు సమన్వయంగా సమావేశం నిర్వహించి, పార్టీలో కొందరి సభ్యులను చేర్చితే, దానిని జీర్ణించుకోలేక అధికార వైసీపీ నేతలు బ్యానర్ చించి వేశారంటూ పోలీసులకు తప్పుడు ఫిర్యాదు చేశారని చెప్పారు. పోలీసులు సమాచారాన్ని విచా రించకుండానే కొందరి యువకులపై బైండోవర్ కేసు నమోదు చేశారని, ఇలా ఏకపక్షంగా వ్యవహరించడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఎన్ని అరెస్టులు చేసినా టీడీపీ, జన సేన పార్టీలు విజయం సాధిస్తాయని స్పష్టం చేశారు. పోలీ సులు ఇకనైనా నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి స్వామినాథన్, గౌరవ అధ్యక్షుడు రాజేంద్రరాజు, నాయకులు నాగరాజు, నాథముని తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం వచ్చాక వదిలేశాడు

- భర్త కుటుంబ సభ్యుల నుంచి రక్షణ కల్పించాలని పోలీసులకు భార్య విజ్ఞప్తి



మాట్లాడుతున్న శ్రీదేవి

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 20: ఇద్దరమూ ప్రేమించి పెళ్లి చేసుకు న్నామని, ఉద్యోగం వచ్చాక కుటుంబ సభ్యుల మాటవిని భర్త తనను వదిలేశాడని తిరుపతి జిల్లా పుత్తూరుకు చెందిన శ్రీదేవి ఆవేదన వ్యక్తం చేశారు. మంగళ వారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఆమె మాట్లాడుతూ నారాయణవనంకు చెందిన రామచంద్రన్, తాను పుత్తూరులోని ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో పనిచేశామని చెప్పారు. తనను ప్రేమిస్తున్నానని చెప్పడంతో 2014లో వివాహం చేసుకున్నామని అన్నారు. ఆ తర్వాత అతడికి హోం గార్డు ఉద్యోగం రావడంతో కట్నం కోసం తనను వదిలించుకోవడానికి ప్రయత్నించారని ఆరో పించారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని, అతడి కుటుంబ సభ్యులు బలవంతంగా తమను విడదీశారని అన్నారు. తన భర్త కుటుంబసభ్యుల నుంచి తనకు ప్రాణహాని ఉందని, తనకు పోలీసులు రక్షణ కల్పించాలని కోరారు. పోలీసు ఉన్నతాధికారులు స్పందించి తమ కాపురాన్ని నిలబెట్టాలని కన్నీటి పర్యంతమయ్యారు.

నేడు నగరపాలక సర్వసభ్య సమావేశం

చిత్తూరు, ఫిబ్రవరి 20: చిత్తూరు నగరపాలక సంస్థ సర్వ సభ్య సమావేశం బుధవారం జరుగుతుందని మేయర్ అముద తెలిపారు. ఉదయం 11 గంటలకు బడ్జెట్ సమా వేశం, మధ్యాహ్నం కౌన్సిల్ సాధారణ సమావేశం జరుగు తుందన్నారు. సమావేశానికి ఎక్స్ అఫిషియో సభ్యులు, కార్పొరేటర్లు, కో-ఆప్షన్, నగరపాలక అధికారులు హాజరు కావాలని కోరారు.

ట్రాన్స్‌ఫార్మర్లు లేక

ఎండుతున్న పంటలు

● పట్టించుకోని విద్యుత్‌శాఖ అధికారులు



ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్



టీవీఎన్ఆర్‌పురంలో ఎండుతున్న చెరకుతోట

పాలసముద్రం, ఫిబ్రవరి 20: ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యంతో పంటలు ఎండి పోతున్నాయి. మండలంలోని టీవీఎన్ఆర్‌పురంలో జనవరి 1వ తేదీన రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను దొంగలు పగులగొట్టి, అందులో వున్న రాగి వైర్లను దోచుకెళ్లారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ల పరిధిలోని చిన్నబ్బ రాజు, గంగ మండడి, నర సింహులు మండడి, చిన్నబ్బ, నడిపి మండడి తదితర రైతులు పంటలు సాగుచే స్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ విషయమై ట్రాన్స్‌కో అధికారులకు, పాలసముద్రం పోలీసులకు రైతులు ఫిర్యాదుచేశారు. ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసంచేసి, రాగివైర్లను చోరీచేసుకెళ్లిన దొంగలను సైతం 15 రోజుల క్రితం అరెస్టు చేసి రిమాండ్‌కు తర లించారు. అయితే చోరీకి గురై, ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో కొత్త ట్రాన్స్ ఫార్మర్లను ట్రాన్స్‌కో అధికారులు ఏర్పాటు చేయలేదు. దీంతో ఆ ట్రాన్స్‌ఫార్మర్ల పరిధిలో సాగుచేసిన వరి, చెరకు తోటలు ఎండిపోతున్నాయి. ట్రాన్స్‌కో అధికారుల చుట్టూ కాళ్లరిగేలా రైతులు ప్రదక్షిణలు చేస్తున్నా వారు మాత్రం కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడం లేదు. తాము ప్రభుత్వానికి నివేదికలు పంపామని, కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు వచ్చినతర్వాత ఏర్పాటు చేస్తామని ట్రాన్స్‌కో అధికారులు రైతులకు సమాధానం చెప్తున్నారు. వేలాది రూపాయలు పంటసాగు కోసం ఖర్చుచేసి నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు స్పందించి కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

- మాజీ ఎమ్మెల్సీ దొరబాబు



రా.. కదలిరా కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నేతలు

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 20: టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు అన్నారు. మంగళవారం నగరంలోని 12వ డివిజన్ 190 రామాపురం, 13వ డివిజన్ మాపాక్షి క్రాస్‌లలో టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో గడప గడపకు 'రా.. కదలిరా' కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రం 30 ఏళ్ళు వెనక్కు వెళ్ళిందని చెప్పారు. సంక్షేమం పేరుతో సీఎం జగన్ ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపిం చారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధిని పూర్తిగా విస్మరించిందని అన్నారు. టీడీపీ పాలనలో చంద్రబాబు అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలను అందించారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. అనంతరం స్థానికులకు టీడీపీ మినీ మ్యానిఫెస్టోతో ముద్రించిన కరపత్రాలను పంచిపెట్టారు. నేతలు కాజూరు బాలాజి, కటారి హేమలత, తేజస్విని, కోదండయాదవ్, మోహన్‌రాజ్, వెంకటేష్ యాదవ్, శశికర్ బాబు, కంద, రాజశేఖర్, రాణి, కాంద్ర రమేష్ నాయుడు, నరేష్, రాజా నాయుడు, నారాయణ, సేటు, శంకర్, లత, దేవేంద్ర, ఎల్ బాబు, రాధా కృష్ణ, సురేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బంగారమ్మకు విశేష పూజలు



కార్వేటినగరం, ఫిబ్రవరి 20: కార్వేటినగరం గ్రామ దేవత బంగారమ్మ ఆలయంలో మంగళ వారం విశేష పూజా కార్యక్రమాలు నిర్వహిం చారు. ఆలయానికి వచ్చి న భక్తులకు కమిటీ అ ధ్యక్షులు ప్రసాద్ ఆధ్వ ర్యంలో తీర్థ ప్రసాదాలు అందజేశారు.

బోధన వివరాలు యాప్‌లో

అప్‌లోడ్ చేయాలి: డీఈవో

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 20: ఉపాధ్యాయులు బోధిస్తున్న తరగతి, ఏ సబ్జెక్టులో బోధిస్తున్నారో వివరా లను యాప్‌లో అప్‌లోడ్ చేయాలని డీఈవో దేవరాజ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ యాజ మాన్య పాఠశాలల్లోని ఉపాధ్యాయులు విద్యాశాఖ కమిష నర్ ఆదేశాల మేరకు రాష్ట్ర విద్యాశాఖ రూపొందించిన విద్యాశాఖ షిఫ్ట్ చార్ట్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆదేశించారు. బోధన సబ్జెక్టు, తరగతి వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు.

మార్చి 3న పల్స్‌పోలియో



వైద్యాధికారుల సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో పుల్లయ్య

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 20: జిల్లావ్యాప్తంగా వచ్చేనెల 3వ తేదీన పల్స్ పోలియో కార్యక్రమాన్ని వందశాతం విజయవంతంగా నిర్వహించాలని డీఆర్వో పుల్లయ్య అన్నారు. మంగళవారం పల్స్‌పోలియో విజయవంతానికి సంబంధించి కోఆర్డినేషన్ కమిటీ సమావేశం డీఆర్వో ఛాంబర్‌లో జరిగింది. భవిష్యత్‌లో ఎవ రికీ పల్స్‌పోలియో వ్యాధి సోకకుండా 0-5 సంవత్సరాల పిల్లలందరికీ పోలియో చుక్కలు వేసి పోలియోరహిత జిల్లాగా చిత్తూరును తీర్చిదిద్దాలని సూచించారు. అంతకుముందు పల్స్‌పోలియోకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ రాజశేఖర్, డీఆర్డీఏ పీడీ తులసీ, వైద్య, ఆరోగ్య శాఖ అధికారి రవిరాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

● ఎన్నికల విధుల్లో ఎవరికీ మినహాయింపుల్లేవు

త్వరలో జరిగే ఎన్నికల ప్రక్రియలో మినహాయింపులు కొందరికి తప్ప మిగిలి నవారికి లేవని జేసీ శ్రీనివాసులు హెచ్చరించారు. మంగళవారం రాత్రి తన చాంబర్‌లో ఎన్నికల విధుల నుంచి మినహాయింపు కోరుతూ వచ్చిన ఉద్యోగు లతో ఆయన సమావేశమయ్యారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు దీర్ఘకా లిక వ్యాధులు, దివ్యాంగులు, గర్భిణులు, బాలింతలు, పదవీ విరమణకు దగ్గరలో వున్న ఉద్యోగులకు మాత్రమే మినహాయింపులు ఉంటాయని చెప్పారు. ఎన్నికల ప్రక్రియలో మిగిలిన అందరూ విధులు నిర్వహించాల్సిందేనని అన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగుల నుంచి అందిన అభ్యర్థనలను ఆయన భౌతికంగా పరిశీ లించి, కొందరికి మినహాయింపులు ఇచ్చారు. సమావేశంలో డ్వామా పీడీ రాజశే ఖర్, ఎస్‌డీసీ శివయ్య, ఇతర జిల్లాల అధికారులు హాజరయ్యారు.

● కోర్టు భవన నిర్మాణాలను వేగవంతం చేయండి: జేసీ

చిత్తూరులో నిర్మిస్తున్న కోర్టు భవన సముదాయ పనులను వేగవంతం చేసి మార్చి 2వ తేదీ లోగా అప్పగించాలని జేసీ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం జేసీ తన చాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. మార్చి మొదటి వారంలో కోర్టు భవనాలను ప్రారంభించే అవకాశం ఉన్నందున పనులు త్వరిత గతిన పూర్తిచేయాలన్నారు. డీఆర్వో పుల్లయ్య, డ్వామా పీడీ రాజశేఖర్, ఎస్డీపీ శివయ్య, ఆర్&బీ ఎస్ఈ మునీశ్వర్ రెడ్డి, పలువురు కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

కష్టపడి చదివితే ఉన్నత స్థాయికి చేరుతారు



మాట్లాడుతున్న ఏపీ కళాశాలల విద్యా కమిషనర్ పోలా భాస్కర్

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 20: కష్టపడి చదివితే ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి చేరుకుంటాడని ఎస్వీయూ వైస్ చాన్సలర్ శ్రీకాంత్‌రెడ్డి, ఏపీ కళాశాలల విద్యా కమిషనర్ పోలా భాస్కర్‌లు పేర్కొన్నారు. పీవీకేఎన్ డిగ్రీ కళాశాల రెండవ స్నాతకోత్సవాన్ని మంగళవారం ప్రిన్సిపాల్ జీవనజ్యోతి అధ్యక్షతన కళా శాల ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథు లుగా పాల్గొన్న ప్రముఖులు మాట్లాడుతూ వ్యవస్థలో మార్పులకు అనుగుణంగా విద్యార్థులు నైపుణ్యాభివృద్ధిని పెంచుకుని రాణించాలని ఆకాంక్షించారు. గ్రాడ్యు యేషన్ పూర్తి చేసిన విద్యార్థులను అభినందిస్తూ దేశాభివృద్ధికి తమ వంతు బాధ్యతగా ఎదగాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ వార్షిక నివేదికను చదివి వినిపిం చారు. అనంతరం ప్రముఖుల చేతుల మీదుగా విద్యార్థులకు డిగ్రీ పట్టాలను అందజేశారు. కార్యక్రమంలో కడప ఆర్జేడీడీఈ బాబు, ఏజీవో తులసి, సీసీఈ మంగళగిరి, ఎస్వీయూ సీఈ దామ్లానాయక్, సీఈవో సేతురామన్, తిరుమల కెమికల్స్ లిమిటెడ్ శాస్త్రవేత్త డాక్టర్ వీరబ్రహ్మం, డీఆర్‌డీవో హైదరాబాదు సిద్ధార్థ్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మా డిమాండ్లు పరిష్కరించండి: జేఏసీ



నిరసన తెలుపుతున్న జేఏసీ నాయకులు

గుడిపాల, ఫిబ్రవరి 20: మా డిమాండ్లను త్వరగా పరిష్కరించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు గోపీనాథం అన్నారు. మంగళవారం నరహరిపేట హైస్కూల్‌లో ఏపీజేఏసీ ఆధ్వర్యంలో సీఆర్‌సీ సమావేశాన్ని బహిష్కరించి గంటపాటు నిరసన తెలి పారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన పీఎఫ్ తదితర బకాయిలను వెంటనే విడుదలచేసి, 30శాతం ఐఆర్‌ను ఇవ్వాలని డిమాండ్ చేశారు.

జాబ్‌మేళాలో పలువురికి ఉద్యోగావకాశాలు



సమావేశంలో మాట్లాడుతున్న విజయానంద రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 20: స్థానిక ఎస్వీసెట్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగ ళవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రీజనల్ మెగా జాబ్ మేళా జరిగింది. ఇందులో ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ విజయానందరెడ్డితో పాటు ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ జనరల్ మేనేజర్ హెచ్. భారతి, ఎస్వీసెట్ ప్రిన్సిపాల్ ఎం. మోహన్ బాబు తదితరులు పాల్గొన్నారు. ఈ జాబ్‌మేళాలో తిరుపతి, ప్రకాశం, నెల్లూరు, అన్న మయ్య, కడప, శ్రీసత్యసాయి, అనంతపూర్, నంద్యాల, కర్నూలు జిల్లాలకు సంబంధిం చిన నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారులు పాల్గొన్నారు. జాబ్‌మేళాలో వివిధ రంగాలకు చెందిన 110 బహుళ జాతీయ కంపెనీల ప్రతినిధులు హాజరుకాగా, 3862 మంది నిరుద్యోగ యువతీ యువకులు హాజరయ్యారు. కాగా, వారిలో 1667 మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయి.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి

రథోత్సవం



గుడిపాల, ఫిబ్రవరి 20: తమిళ నాడులోని వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి రథోత్సవం కమ్మ సంఘం ఆధ్వర్యంలో మంగళ వారం ప్రారంభమైంది. మూడు రోజుల పాటు గిరి ప్రదర్శనను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు రామచంద్ర నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారి రథా నికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రథాన్ని లాగారు.

విద్యార్థులకు సులభపద్ధతిలో బోధించాలి

పాలసముద్రం, ఫిబ్రవరి 20: ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠ్యాంశా లను సులభ పద్ధతిలో బోధించాలని ఎంఈవో గిరిజ పేర్కొన్నారు. మంగ ళవారం పాలసముద్రం ఎమ్మార్సీ కార్యాలయంలో ఉపాధ్యాయులకు సీఆర్సీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఉపాధ్యాయు లకు మిస్ కాన్సెప్ట్ ఆఫ్ పోస్టర్స్, టీచర్స్ టూర్ తదితర అంశాలపై అవగా హన కల్పించారు. ఈ కార్యక్రమంలో రీసోర్స్‌పర్సన్లు ప్రకాష్, కుమార్, కోదండయ్య, సెల్వం, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ టాయిలెట్‌ను ఏర్పాటు చేయరా....?

గుడిపాల, ఫిబ్రవరి 20: మండల కేంద్రమైన గుడిపాలలో పబ్లిక్ టాయిలెట్‌ను ఏర్పాటు చేయాలని పలుమార్లు ఇటు అధికారులు, అటు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్ళినా ఫలితం లేకపోయిందని ప్రజలు ఆవే దన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలో తహసీల్దార్, ఎంపీడీవో, ఎమ్మార్సీ, వ్యవసాయ, సింగిల్ విండో, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, గ్రంథా లయం తదితర ప్రభుత్వ కార్యాలయాలున్నాయి. ఇక్కడికి తరచూ వివిధ సమస్యలపై ప్రజలు వస్తూ వెళుతుంటారు. అత్యవసర సమయాల్లో మల, మూత్ర విసర్జనలకు ఒక్క పబ్లిక్ టాయిలెట్ కూడా లేకపోవడంతో మహి ళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి పబ్లిక్ టాయిలెట్లను ఏర్పాటు చేయాల్సిన అవ సరం ఎంతైనా ఉంది.

గడ్డివామికి నిప్పంటించిన ఆకతాయిలు

గంగవరం, ఫిబ్రవరి 20: గుర్తుతెలియని ఆకతాయిలు గడ్డివామికి నిప్పంటించారు. ఈ సంఘటన మంగళవారం గుండుగల్లు గ్రామంలో చోటు చేసుకొంది. బాధితుల కథనం మేరకు... గుండుగల్లు గ్రామానికి చెందిన జయ రామయ్య పొలం వద్ద వరిగడ్డి వామి వేశాడు. మంగళ వారం మధ్యాహ్నం పొలం వద్ద పనులు పూర్తి చేసుకొని భోజనం కోసం ఇంటికి వచ్చాడు. ఆ సమయంలో పొలం వద్ద గడ్డికి నిప్పంటుకొని మంటలు ఎగసిపడ్డాయి. చుట్టు పక్కల రైతులు హుటాహుటిన అక్కడకు చేరుకొని మంటలను ఆర్పడానికి ప్రయత్నించారు. అయితే అప్పటికే గడ్డి వామి పూర్తిగా దగ్ధమైంది. గడ్డివామి పక్కనే ఉన్న షెడ్డుకు కూడా నిప్పం టుకోవడంతో, అందులోని సామగ్రి అగ్నికి ఆహుతైంది. సుమారు రూ.2 లక్షల నష్టం వాటి ల్లింది. గుర్తు తెలియని ఆకతాయిలే గడ్డివామికి నిప్పం టించి ఉంటారని బాధిత రైతు బోరున విలపించాడు. అధికారులు స్పందించి తనను ఆదుకోవాలని పోలీసులకు, రెవిన్యూ అధికారులకు విన తిపత్రం అందించాడు.

స్టార్టరు లేక పాతార్కాడులో తాగునీటి సమస్య



విజయపురం, ఫిబ్రవరి 20: మండలంలోని పాతార్కాడులో స్టార్టరు లేకపోవడంతో వారం రోజుల పాటు తాగునీటి సమస్య చోటు చేసుకుంటున్నదని గ్రామ స్తులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఉన్న స్టార్టరును వేరే ప్రాంతంలో అమర్చడం వలన తాగునీటి సమస్య ఏర్పడిందని తెలిపారు. తా గునీటికి ఇబ్బంది పడుతున్నామని, అధికారులు స్పం దించి తగుచ ర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.